ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 30, జూన్ 2025



క్వారీలను జల్లెడ పడుతున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

- సూర్యా గ్రానైట్‌లో ఘటన ఎఫెక్ట్‌తో చర్యలు
- రాయి వెలికితీత, మిషనరీ నిర్వహణపై కన్ను
- 150కిపైగా లీజుల్లో తనిఖీలకు నెల పట్టే అవకాశం
- మైన్స్ అధికారులను దూరంపెట్టి సమగ్ర పరిశీలన
- వెలుగుచూసిన విషయాలపై ప్రభుత్వానికి నివేదిక
- యజమానుల్లో గుబులు పుట్టిస్తున్న వ్యవహారం

గ్రానైట్‌పై తనిఖీల పిడుగు

గ్రానైట్ క్వారీలపై తనిఖీల పిడుగు పడింది. సూర్యా గ్రానైట్ క్వారీ ఘటన ఎఫెక్ట్‌తో అన్ని క్వారీలలో తనిఖీలు చేయాలని విజిలెన్స్ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీంతో గ్రానైట్ ఓనర్లలో ఆందోళన నెలకొంది. సహజంగా క్వారీల లోపల విజిలెన్స్ శాఖ వారు మైనింగ్ అధికారులను కలుపుకొని తనిఖీలు చేస్తుంటారు. కానీ ప్రస్తుతం వారికి కనీస సమాచారం కూడా లేకుండా క్షుణ్ణంగా పరిశీలించటం గ్రానైట్ వర్గాల్లో గుబులు రేపుతోంది. ఎందుకంటే గతంలో మైనింగ్, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి క్వారీయింగ్‌లో గుర్తించిన లోపాలపై భారీ స్థాయిలో పెనాల్టీలు విధించారు. ఈ తతంగంపై యజమానులు కోర్టులకు వెళ్లారు. ఈ వ్యవహారం ముగియకముందే విజిలెన్ అధికారుల బృందం గతంలో ఎన్నడూ లేనివిధంగా విస్తృత స్థాయిలో తనిఖీలను గుట్టుగా నిర్వహిస్తుండటంతో ఏం జరగబోతుందో అని గ్రానైట్ వర్గాల్లో ఆందోళన నెలకొంది.

చీమకుర్తి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలపై మరో పిడుగు పడింది. భద్రతా చర్యలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లికి చెందిన సూర్యా గ్రానైట్ క్వారీలో డంపర్ బోల్తాపడి ఇద్దరు కార్మికులు మృత్యువాతపడిన నేపథ్యంలో మైన్స్ అండ్ సేఫ్టీ అధికారులు ఇప్పటికే ఆ క్వారీలో విచారణ జరిపి నివేదిక సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కానీ అసలు గ్రానైట్ క్వారీల్లో జరుగుతున్న కార్యకలాపాలపై నిగ్గుతేల్చాలని దృఢనిశ్చయానికి ప్రభుత్వం వచ్చింది. ఈ మేరకు స్టేట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఆమూలాగ్రం పరిశీలన

చీమకుర్తి, రామతీర్థం పరిసర ప్రాంతాల్లో గెలాక్సీ గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. దాదాపు 150 వరకు లీజులను పొందిన యాభై మంది ఓనర్లు ముడిరాయిని వెలికతీసి నాణ్యమైన రాయిని విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. మిగతా రాయిని స్థానికంగా అనుబంధ పరిశ్రమగా విస్తరించిన కటింగ్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తుంటారు. వీరు ముడిరాయిని పాలిషింగ్ చేసి శ్లాబులుగా మార్చి విదేశాలకు ఎగుమతి చేయటంతోపాటు స్థానికంగా విక్రయించి ఆదాయం పొందుతుంటారు. వీటన్నింటి ద్వారా ప్రభుత్వానికి సైతం అమూల్యమైన విదేశీ మారకద్రవ్యంతోపాటు రాయల్టీ రూపంలో ఖజానాకు సాలీనా రూ.500కోట్ల వరకూ ఆదాయం సమకూరుతుంటుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలతో పరిశ్రమ కుదేలైంది. కుదేలైన పరిశ్రమ కూటమి ప్రభుత్వంలో గాడిన పడుతోంది. ఈ పరిస్థితుల్లో జరుగుతున్న విస్తృతస్థాయి తనిఖీలు పరిశ్రమ మనుగడకు ఇబ్బందికరంగా ఉంటాయేమో అన్న ఆందోళన పరిశ్రమలో వ్యక్తమవుతుంది.

ఏం జరుగుతుందో?

ఒక క్వారీలో ప్రమాదం జరిగితే తప్పుఒప్పులు నిర్ధారించి చర్యలు తీసుకోవాలే కానీ మూకుమ్మడి తనిఖీలు ఏమిటని యజమానులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విజిలెన్స్ అధికారుల బృందం ఇప్పటికే పోకర్ల, ఒంగోలు గెలాక్సీ, సుదర్శన్ క్వారీల్లో తనిఖీలను పూర్తిచేసింది. మిగిలిన 45 వరకూ ఉన్న క్వారీల్లో తనిఖీలను పూర్తిచేయాలంటే దాదాపు నెలరోజుల వరకూ సమయం పట్టే అవకాశం ఉంది. తనిఖీలు పూర్తయిన తర్వాత క్వారీ లీజు పొందిన నాటి నుంచి ఇప్పటివరకూ రాయిని ఎంతమేర వెలికితీశారు అన్న విషయమై మైన్స్ అధికారుల సహాయంతో లెక్కలు కడతామని తనిఖీలు పూర్తయిన తర్వాత ఓనర్లకు విజిలెన్స్ అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా ముడిరాయిని వెలికితీసి రాయల్టీ చెల్లించకుండా స్థానిక ఫ్యాక్టరీలకు విక్రయిస్తున్న వారికి ఈ తనిఖీలు నిద్రలేకుండా చేస్తున్నాయి. లెక్కలు పక్కాగా వస్తే రూ.కోట్లలో పెనాల్టీలు చెల్లించాల్సి వస్తుందని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీవో వెంకటనాయుడు

సచివాలయ ఉద్యోగుల బదిలీలు వేగవంతం

- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన స్థానచలనం
- మూడు జిల్లాల అధికారులను సమన్వయం చేస్తున్న జడ్పీ సీఈవో
- నేటితో ముగియనున్న ప్రక్రియ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. బాపట్ల జిల్లా పరిధిలో చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు ఉండగా, నెల్లూరు జిల్లా పరిధిలో కందుకూరు నియోజకవర్గం ఉంది. దీంతో ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల ఆయా శాఖల అధికారుల ద్వారా సచివాలయ ఉద్యోగుల బదిలీలను సమన్వయం చేసేందుకు జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవికి బాధ్యత అప్పగించారు. వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత వార్డులో కాకుండా ఇతర వార్డుల్లో నియమించేందుకు కసరత్తు చేయగా, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత మండలం కాకుండా మరో మండలంలో నియమించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా వార్డు సచివాలయాల్లో 122 ఉండగా అందులో 1,058 మంది ఉద్యోగులు, 597 గ్రామ సచివాలయాల్లో 5,566 మంది పనిచేస్తున్నారు. దాదాపుగా 90 శాతం మంది ఉద్యోగులను బదిలీలను చేయాల్సి రావడంతో తదనుగుణంగా ఆయాశాఖల అధికారులు కౌన్సెలింగ్‌ను కూడా నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి పరిధిలోని గ్రేడ్-6 సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ శనివారం జరిగింది. బదిలీల కౌన్సెలింగ్ ఆదివారం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ముగిసింది. కొన్ని శాఖల్లో ఇప్పటికే బదిలీలు పూర్తి చేయగా, మరికొన్నిశాఖల్లో సోమవారం ముగియనుంది.

మందపైకి దూసుకెళ్లిన లారీ

11 గొర్రెల మృతి

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మేతకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న గొర్రెల మందపైకి లారీ దూసుకెళ్లింది. ఆదివారం రాత్రి పిల్లికుంట తాండా సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 11 గొర్రెలు మృతి చెందాయి. మెట్లబొటుతాండాకు చెందిన రాయుడు నాయక్ 15 గొర్రెలను మేతకు తీసుకొచ్చి తిరిగి వెళ్తుండగా, మాచర్ల నుంచి రాయచోటి వైపు వెళ్తున్న లారీ గొర్రెల మందపైకి వెళ్లింది. ప్రమాదంలో 11 గొర్రెలు మృతిచెందాయి. సుమారు లక్షన్నర నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



సమావేశపు హాలులోకి వెళ్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి

ప్రజల్లోకి ప్రభుత్వ విజయాలు

- టీడీపీ నేతలకు అధినేత చంద్రబాబు దిశానిర్దేశం
- జూలై 2 నుంచి ఇంటింటికీ పార్టీ శ్రేణులు
- నెల రోజులపాటు కార్యక్రమం నిర్వహణ
- రాష్ట్రస్థాయి వర్క్‌షాపునకు హాజరైన ముఖ్యనేతలు

ఒంగోలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదికాలం పూర్తికాగా ఈ ఏడాది సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి తెలుగుదేశం పార్టీ పేరుతో జూలై 2 నుంచి నెల రోజుల పాటు కార్యక్రమం చేపడుతున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన టీడీపీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్లమెంట్ పార్టీ అధ్యక్షులతో జరిగిన వర్క్‌షాపులో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. జిల్లా నుంచి మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో పాటు ఎమ్మెల్యేలు జనార్దన్, బీఎన్ విజయకుమార్, ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు దామచర్ల సత్య, నూకసాని బాలాజీ, నియోజకవర్గ ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండాలని, వారి సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులు చేయాలన్నారు. ప్రత్యక్షంగా పేర్లు చెప్పకపోయి నప్పటికీ కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసి పనితీరు మార్చుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం.

ఉపాధి బిల్లులకు మోక్షం



- చెల్లింపులకు ఏర్పాట్లు... అప్‌లోడ్ చేస్తున్న అధికారులు
- వారం రోజుల్లో నగదు జమకు అవకాశం
- పాత బకాయిలు పూర్తిగా, తాజా వాటిలో మూడో వంతు జమకు చర్యలు

దాదాపు తొమ్మిది నెలలుగా నిలిచిపోయిన ఉపాధి పథకం మెటీరియల్ కోటా బిల్లులకు మోక్షం లభించనుంది. పెండింగ్ బకాయిలలో పాత వాటిని పూర్తిగా, ఈ ప్రభుత్వంలో చేసిన వాటిలో మూడవ వంతు చెల్లింపునకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ ప్రక్రియను డ్వామా సిబ్బంది చేస్తున్నారు.



ఒంగోలు, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపాధి పథకం మెటీరియల్ కోటా ద్వారా పనులు చేశారు. నగటున ఒక్కో నియోజకవర్గానికి రూ.15 కోట్ల వంతున సీసీరోడ్లు, డ్రెయిన్లు, ఇతర పనులు మంజూరు చేయగా, పాడిరైతులకు పశువుల షెడ్లు మంజూరు చేశారు. అలా సుమారు రూ.13 కోట్ల విలువైన పనులు నియోజకవర్గాల వారీ, మరో రూ.12 కోట్ల వరకు పశువుల షెడ్లు మంజూరు చేశారు. అందులో దాదాపు రూ.130 కోట్ల విలువైన సీసీరోడ్లు, డ్రైన్లు ఇతర పనులు పూర్తిచేయగా మరో రూ.10 కోట్ల పశువుల షెడ్ల పనులు జరిగాయి. తొలుత చేసిన పనులకు ప్రతి గురువారం చెల్లింపులు జరిగాయి. అలా గత ఏడాది అక్టోబరు వరకు సుమారు రూ.30 కోట్ల బిల్లులు సీసీరోడ్లు, డ్రెయిన్లు ఇతర పనులకు సంబంధించి చెల్లింపులు జరగ్గా మరో రూ.101 కోట్ల బకాయిలు ఉన్నాయి. పశువుల షెడ్లకు సంబంధించి రూ28.60 కోట్ల బకాయిలు ఉండగా గతంలో 2014-19 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులకు కూడా దాదాపు రూ.30 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు అంచనా. అందులో కొన్ని పనులకు వైసీపీ ప్రభుత్వం చెల్లింపులు నిలిపివేయగా, మరికొన్నింటికి అసలు బిల్లులే తయారు చేయకుండా ఆపేసిన పనులు జాబితాలో చూపారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ బకాయిలపై దృష్టి పెట్టి బిల్లులు చేసి ఉన్నవాటి వివరాలు సేకరించింది. అలాంటివాటిలో సుమారు రూ.11.40 కోట్ల మేర బకాయిలకు సంబంధించి పూర్తి బిల్లులు ఉన్నట్లు డ్వామా అధికారులు గుర్తించారు. అన్నీ కలిపి రూ.125 కోట్ల బకాయిలు ఉండగా మరో రూ.40 కోట్ల వరకు బిల్లులు చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో లెక్క ఇదీ..

జిల్లాలో సుమారు రూ.65 కోట్ల మేర బకాయిలు త్వరలో రానున్నాయి. అందులో రూ.45 కోట్ల వరకు సీసీరోడ్లు, డ్రెయిన్లు ఇతరత్రా ప్రస్తుత ప్రభుత్వంలో చేసిన పనులకు వచ్చే అవకాశం ఉంది. 2014-19 మధ్య కాలం నాటి బకాయిలు రూ.11.30 కోట్లు, పశువుల షెడ్లకు రూ.8.40 కోట్లు రానున్నాయి. అందుకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేస్తుండగా వారంలో నగదు జమ కావచ్చని చెప్తున్నారు. దీంతో బిల్లులకోసం ఎదురు చూస్తున్న వారికి కొంత మేర ఊరట కలగనుంది.

వ్యాపారుల తీరు మారకపోతే

వేలం కేంద్రాలు నిలిపివేత

- పొగాకు రైతు కమిటీ ప్రతినిధుల సమావేశంలో తీర్మానం
- దిగజారిన ధరలు, నోబిడ్‌లపై తీవ్ర ఆందోళన



సమావేశంలో పాల్గొన్న పొగాకు రైతు ప్రతినిధులు

ఒంగోలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పొగాకు మార్కెట్లో వ్యాపారులతీరుపై రైతులు మండిపడుతున్నారు. వేలం ప్రక్రియ దక్షిణాదిలో ప్రారంభమై మూడున్నర నెలలు గడిచినా మార్కెట్ ఏ మాత్రం ఆశాజనకంగా లేకపోగా ధరలు దిగజారడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వ్యాపారుల తీరును ఆక్షేపిస్తున్న రైతులు, వారిని నియంత్రించి తమకు మేలు చేసేలా చూడటంలో పొగాకు బోర్డు వ్యవహరిస్తున్న తీరుపైనా అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే విషయం గత రాత్రి ఒంగోలులో జరిగిన దక్షిణాది ప్రాంత 11 వేలం కేంద్రాల రైతు కమిటీ ప్రతినిధులు సమావేశంలో చర్చించారు. వ్యాపారులు అలాగే వ్యవహరిస్తే వేలం కేంద్రాలను నిలిపివేసేందుకు ఆ సమావేశంలో తీర్మానించారు. కొండపి వేలం కేంద్రంకు చెందిన పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బ్రహ్మయ్య అధ్యక్షతన ఒంగోలులో పొగాకు బోర్డు ఆర్ఎం కార్యాలయ సమావేశపు హాలులో ఈ సమావేశం జరిగింది. బోర్డు మాజీచైర్మన్ కొండారెడ్డి, వేలం కేంద్రాల రైతు కమిటీల ప్రతినిధులు వడ్డెళ్ల ప్రసాద్, పోతుల రామారావు, అబ్బూరి శేషగిరిలో పాటు వివిధ వేలం కేంద్రాల రైతు నాయకులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. సుమారు 54 మిలియన్ కిలోలు పంట కొనుగోలు ఇప్పటి వరకు జరగ్గా సగటున కిలోకు రూ.250 వరకు లభించిందని, ఇంకా సుమారు 105 మిలియన్ల పంట రైతుల వద్ద ఉన్నట్లు అంచనా వేశారు. వేలం ప్రారంభ రోజున గరిష్ఠ ధర కిలో రూ.280, కనిష్ట ధర కిలో రూ.230 ఉండగా ప్రస్తుతం గరిష్ట ధర ఒక్క రూపాయి కూడా పెరగకపోగా కనిష్ట ధర రూ.150కి దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు మించినిత్యం పలు వేలం కేంద్రాలలో 25 నుంచి 40 శాతం వరకు నోబిడ్‌లు ఉండటం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. మేలు రకం, మీడియం గ్రేడ్‌లకు ధరలు పెంచకుండా కూటమి కట్టి సీలింగ్ పెట్టుకుంటున్న వ్యాపారులలో గ్రేడ్‌లను అసలు కొనేందుకు ముందుకు రాకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుందని సమావేశంలో పాల్గొన్న పలువురు రైతు నాయకులు అభిప్రాయపడ్డారు. రైతులకు మేలు జరిగేలా చూడాలని పొగాకు బోర్డు చర్యలు ఏ మాత్రం లేవని అవేదన వ్యక్తంచేశారు. ఇలా అయితే ఈ ఏడాది రైతాంగం బ్యారన్‌కు నాలుగైదు లక్షల రూపాయాల మేర నష్టపోవడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. సోమవారం నుంచి మార్కెట్లో పరిస్థితి మార్పు తీసుకురావాలని అటు వ్యాపారులు, ఇటు బోర్డు అధికారులకు సమావేశం విజ్ఞప్తిచేసింది. లేనిపక్షంలో గురువారం (జూలై 3) నుంచి నిరవధికంగా వేలం కేంద్రాలను నిలిపివేయాలని రైతు ప్రతినిధులు సమావేశంలో తీర్మానించింది.



పాలుట్లలో పెద్ద పులి దాడిలో మృతి చెందిన ఆవు

పెద్దపులి దాడిలో రెండు ఆవుల మృతి

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పెద్దపులి దాడిలో మరో రెండు ఆవులు మృత్యువాతపడ్డాయి. మండలంలోని పాలుట్ల గిరిజన గ్రామంలో శనివారం రాత్రి ఆవుల మందపై పెద్దపులి దాడి చేసింది. ఈ ఘటనలో కొండావత్ నాయక్‌కు చెందిన రెండు ఆవులు మృతి చెందాయి. మరో ఆవుకు తీవ్ర గాయాలైనట్లు గిరిజన రైతు తెలిపారు. మృతిచెందిన ఆవుల విలువ లక్షా 50వేలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

గూడేలలో గుబులు

- పులుల దాడితో జనం బెంబేలు
- వరుస ఘటనలతో ఆందోళన
- ఈనెలలోనే రెండుసార్లు విసిరిన పంజా
- నాలుగు ఆవుల మృత్యువాత

7

బదిలీ టీచర్ల జీతాలకు లైన్ క్లియర్

7

ఆస్తి వివాదంలో మహిళ ఆత్మహత్యాయత్నం



7

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



అధ్యక్షుడు శ్రీనివాసరావును కలిసిన మండల నాయకులు

సంతనూతలపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదివారం మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో సంతనూతలపాడు మండల పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, మండల ప్రధానకార్యాదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, మహిళా నాయకురాలు ఆరికట్ల సుమతి, తెలుగు యువత అధ్యక్షుడు ముప్పరాజు శ్రీనివాసరావు, సంతనూతలపాడు, గుమ్మళంపాడు గ్రామాల అధ్యక్షులు బొడ్డు శంకర్‌బాబు, బొడ్డపాటి చంద్రశేఖర్, నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నాగులుప్పలపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ల గ్రామంలో వేంచేసిన సువర్చలా అభయాంజనేయస్వామి వారి వార్షిక కల్యాణం దేవస్థాన కమిటీ ఆధ్వ ర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు వేదమంత్రాల నడుమ స్వామి వారి కల్యాణ క్రతువును నిర్వహించారు. సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ, వీరాంజనేయులు దంపతులతో పాటు గ్రామానికి చెందిన పలువురు దంపతులు పెద్ద ఎత్తున కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కూటమి నాయకులు ఐక్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మద్దిపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు ఐక్యంగా పని చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ మండలాధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మద్దిపాడులో ఆయన కూటమి నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి నాయకులు ఐక్యంగా పనిచేయాలని, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ అధ్వాన్నంగా తయారయ్యాయని విమర్శించారు. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కూటమి లక్ష్యానికి కట్టుబడి పని చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి వెంకటరమణరావు మాట్లాడుతూ వైసీపీ పాలనతో భూముల పాస్‌పుస్తకాలపై జగన్ బొమ్మలు వేసి రైతులను భయాందోళనకు గురి చేశారన్నారు. అనంతరం ఉప్పుగుండూరి నాగేశ్వరరావును కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయులు

కొండపి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : 'ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు నిరవేరుస్తావు బాబు' అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు ప్రశ్నించారు. ఆదివారం మండలంలోని పెరిదేపి గ్రామంలో సీపీఎం కార్యాలయం వద్ద మండల కమిటీ సమావేశాన్ని ముప్పరాజు చిన్నబ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు కంటే అధికంగా హామీలు ఇచ్చారన్నారు. వాటిని వెంటనే నిరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేజీ.మస్తాన్, సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండయ్య విద్యా సేవలు అభినందనీయం



కొండయ్యను సన్మానిస్తున్న ఎంఈవోలు

నాగులుప్పలపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు హెచ్‌ఎం తన్నీరు కొండయ్య ఎనలేని కృషి చేశారని ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్య పేర్కొన్నారు. మద్దిరాలపాడు గ్రామంలోని పీవీసీ ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన కొండయ్య ఉద్యోగ విరమణ సభ ఆదివారం స్థానిక పాఠశాలలో జరిగింది. టీడీపీ టిడిపి సీనియర్ నాయకులు గుమ్మడి సాయిబాబా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొండయ్యను ఎంఈవోలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వడ్డెళ్ల విజయ, హైస్కూల్ హెచ్‌ఎం కరిముల్లా, హనీఫ్, నెప్పల కృష్ణమూర్తి, షేక్ ఖాజావలి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు టి.ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు సౌకర్యంగా పోలింగ్ కేంద్రాలు

- ఆర్డీవో లక్ష్మీప్రసన్న



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఆర్డీవో లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ, రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక గొడుగుపాలెం ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్‌కేంద్రాలను సందర్శించారు. నగరంలో 1200 ఓట్ల కంటే ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను, సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల ప్రస్తుతం ఉన్న పరిస్థితి, సౌకర్యాలను, అలాగే పరిసరాలను కూడా ఆర్డీవో పరిశీలించారు. అనంతరం వివేకానందవిద్యా విహార్, శివప్రసాద్‌కాలనీలో సచివాలయంలో, ఓపీఎస్ స్కూలు, రాజీవ్‌నగర్‌లోని జేవీఎస్ స్కూలు, హౌసింగ్‌బోర్డుకాలనీలోని కేంద్రీయ విద్యాలయంలోని పోలింగ్‌కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పిన్నిక మధుసూదన్, క్రాంతికుమార్, ఎస్‌కే.రసూల్, గుర్రం సత్యనారాయణ, ఎలక్షన్ డీటీలు సలోమి, సాయి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

- పలు సంఘాల పిలుపు



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిరసిస్తూ వచ్చేనెల 9వతేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పలువురు నాయకులు కోరారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం కేంద్ర కార్మిక సంఘాల సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కె.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సార్వత్రిక సమ్మె విజయవంతం కోసం తీసుకోవాల్సిన పలు అంశాలపై చర్చించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ చర్యలను తప్పుపట్టారు. ఈ లేబర్ కోడ్ విధానం అమలులోకి వస్తే యూనియన్ పెట్టుకునే హక్కుతోపాటు సమ్మె హక్కును కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. లేబర్ కోడ్స్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణచేసే విధానాలను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో చేపట్టిన ఈ సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎం.రమేష్, శ్రీనివాసరావు, వెంకట్రావు, టి.మహేష్, తంబి శ్రీనివాసులు, పారా శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన ఛత్రపతి శివాజీ నాటకం

- నగరంలో భారీ బైక్ ర్యాలీ
- వందలాదిగా పాల్గొన్న ప్రజలు



నాటికలోని ఓ సన్నివేశం

ఒంగోలు కల్చరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఒంగోలులోని ఏకేవీకే కళాశాల ప్రాంగణంలో ప్రదర్శించిన జయహో శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ చారిత్రక నాటకం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. డాక్టర్ పీవీఎస్.కృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ నాటకంలో శివాజీగా పి.సాయి శంకర్, సమర్థ రామదాసుగా డాక్టర్ పీవీఎస్.కృష్ణ, సయిబాయిగా సీహెచ్.తేజశ్రీ, జిజియా బాయిగా బి.రూపాశ్రీ, బడీ బేగం పాత్రలో జీఎన్‌డీ.కుసుమసాయి, చిన్నిబేగంగా వై.పూజిత లక్ష్మి నటించగా దాదాజీ కోండ్‌దేవ్, శహజీ, ఆదిల్షా, ఇతర పాత్రలలో పలువురు నటీనటులు తమ నటనా వైదుష్యం ప్రదర్శించారు. నాటకానికి కుమార సూర్యనారాయణ, సీహెచ్.సుధారాణి, సీహెచ్.సీతారత్నంలు గాత్రం అందించగా, కీబోర్డ్‌పై జె.శ్రావణ్‌కుమార్, రాజభూషణ్, వై.సాయితేజ, తబలా, ప్యాడ్స్‌పై ఎ.బాలు వాద్య సహకారాన్ని అందజేశారు. అంతకుముందు స్థానిక మరాఠాపాలెం నుంచి ఆంధ్రకేసరి విద్యాకేంద్రం వరకు మరాఠా కుటుంబీకులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించగా పెద్దసంఖ్యలో హిందువులు హాజరయ్యారు. జైశ్రీరామ్, ఛత్రపతి శివాజీ మహారాజ్‌కి జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. మరాఠా సంఘ నాయకులు కాళే వెంకటేశ్వర్లు నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో ఆర్‌ఎస్‌ఎస్, సంస్కారభారతి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఇక విద్యార్థులకు పలు విభాగాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. చిత్రలేఖనంలో 200మంది, వ్యాసరచనలో 220మంది, క్విజ్‌లో 14 టీములు ఇలా పలు విభాగాలలో జరిగిన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు, ఇతర అతిథుల చేతులమీదుగా విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో ఘోరకవి సంపత్, ఓరియంటల్ ఉన్నత పాఠశాల కార్యదర్శి వి.చలపతిరావు, సంస్కారభారతి రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుర్భ శ్రీనివాస్, ప్రాంత కార్యదర్శి రంగమన్నారు, కోటి సూర్యనారాయణ తదితరులు పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

ఒంగోలు కల్చరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి గౌరవ సలహాదారు మద్దుల నరసింహారావు ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సంఘం కళాకారులచే ఆదివారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షులను అలరించింది. గానగంధర్వుడు ఎస్పీ.బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విభావలోఓ పలువురు గాయకులు పలు చిత్రాలలోని పాటలను ఆలపించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. ఈ సందర్భంగా మద్దుల నరసింహారావు మాట్లాడుతూ కళలు మన సంస్కృతిలో భాగమని వాటిని ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత కళాకారులు, ప్రజలపై ఉందన్నారు. కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎస్‌కే.బాబు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, పి.జయరాజ్, కె.విజయ్‌కుమార్, శ్రీగిరి శ్రీను, కె.సుబ్బారావు, పి.రామలింగారెడ్డి, ఆళ్ల భాస్కర్‌రెడ్డి, ఇ.అనిల్ కుమార్, ఎం.లక్ష్మీతులసి, ఎ.యామిని, డి.ఉషారాణి, సీహెచ్.శేషారత్నం, తాళ్లూరి శ్రీదేవి, ఎం.రాజకుమారి గాయకులు పాల్గొన్నారు. కీబోర్డుపై బి.జెర్మియా, వి.ఆదాం, ఫ్లూట్‌పై సుభాన్‌వలి, తబలాపై పాండురంగనాథం, నక్కా సుకుమార్, ప్యాడ్‌పై కె.నాగేంద్రబాబు, జాజ్ డి.మోహన్‌రావు వాద్య సహకారాన్ని అందజేశారు.

విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

పొదిలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణులు అన్నింటిలో అభివృద్ధి చెందాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదుమూడి రవిప్రసాద్ అన్నారు. ఆదివారం పొదిలిలోని సామిల్‌లో జిల్లా కోశాధికారి రాచర్ల శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రసాద్ మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా ఉండాలన్న ఆశయంతో సంఘం పనిచేస్తుందన్నారు. ఇప్పటికే సంఘం ఆధ్వర్యంలో సుమారుగా రూ.40లక్షల వరకు దాతల ద్వారా సేకరించి పేద విశ్వబ్రాహ్మణులకు సాయం అందించామని తెలిపారు. ఆదివారం పేద విద్యార్థికి రూ.11వేల సాయం అందజేశామన్నారు. కోశాధికారి రాచర్ల శేఖర్ మాట్లాడుతూ పొదిలిలో ఆరామక్షేత్రాన్ని ప్రభుత్వం నిర్మించాలని ఆయన కోరారు. నామినేటెడ్ పదవుల్లో విశ్వబ్రాహ్మణలకు సముచిత స్థానం కల్పించేందకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చొరవ చూపాలన్నారు. అనంతరం జిల్లా కమిటీలో బాధ్యతలు చేపట్టిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు, మహిళా అధ్యక్షులు గుత్తికొండ కల్యాణ్, సామంతపూడి విజయలక్ష్మి, సంఘ నాయకులు నిమ్మల సూర్యం, బాలసుబ్రమణ్యం, రాచర్ల బ్రహ్మం, ఉప్పుటూరి రంగస్వామి త దితరులు పాల్గొన్నారు.

గుంటిగంగకు చేరుకున్న పాదయాత్ర

తాళ్లూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలను బీసీలో చేర్చాలని బీసీ రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో చిత్తూరు నుంచి అమరావతికి పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పాదయాత్ర నిర్వహిస్తున్న కాపునేతలు ఆదివారం గుంటిగంగకు చేరుకున్నారు. పాదయాత్రలో పాల్గొన్న సాన ప్రసాద్, తదితరులకు తూర్పుగంగవరం, శివరాపురం కాపునేతలు ఘనస్వాగతం పలికారు. గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాపు నాయకులు కనిశెట్టి రామలక్ష్మయ్య, తూము రవి, లక్ష్మీనారాయణ, కొసనా గురుబ్రహ్మం, మారెళ్ల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ-పూరిమెట్ల మధ్య ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని సుంకరవారిపాలెం గ్రామానికి చెందిన చొప్పరపు కోటేశ్వరరావు, మరొకరు పూరిమెట్ల వెళ్తున్నారు. అదేసమయంలో ఉమామహేశ్వర అగ్రహారం గ్రామానికి చెందిన కోటి మారెళ్ళ వెళ్తున్నారు. ఈక్రమంలో ఎదురెదురుగా వాహనాలు ఢీకొనటంతో చొప్పరపు కోటేశ్వరరావు, కోటికి తీవ్రగాయాలయ్యాయి. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. కోటేశ్వరరావును మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ కె.కమలాకర్ పరిశీలించారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు

ఒంగోలు విద్య, జూన్29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు విద్యార్థుల నమోదును పెంచేందుకు ఉపాధ్యాయులు నడుంబిగించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.అబ్దుల్‌హై అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బేసిక్ ప్రైమరీ స్కూల్లో 40 మంది పిల్లలు దాటితే మూడవ పోస్టు కేటాయించాలని కోరారు. పాఠశాలల్లో జూన్ 30 నాటికి ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్ల పనిసర్దుబాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించి వారిని కేవలం బోధనకే పరిమితం చేయాలన్నారు. ఇటీవల ఉద్యోగోన్నతుల పొంది ఇతర పాఠశాలలకు బదిలీ అయినప్పటికీ పాత స్కూళ్లలోనే పనిచేస్తున్న టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహాధ్యక్షుడు ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్నస్వామి, సులోచన పాల్గొన్నారు.

గురుకులంలో బోధనకు దరఖాస్తు చేసుకోవాలి

నాగులుప్పలపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలు గ్రామంలోని గురుకుల పాఠశాలలో 5 నుంచి 10 తరగతుల వరకు ఇంగ్లీష్ బోధించేందుకు బీఎడ్, పీజీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 8712625043 సెల్ నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

ట్రంక్‌రోడ్ షాపుల ఓనర్స్ సంఘం ఏర్పాటు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ట్రంక్‌రోడ్ షాప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. ఒంగోలు నగరం ట్రంక్‌రోడ్‌లోని ఓ షాపులో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడిగా కె.సత్యనారాయణ, కార్యదర్శిగా సీహెచ్.రఘురామ్, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా డి.వినోద్, ఎస్.రామకృష్ణ, ఉప కార్యదర్శులుగా పి.సత్యనారాయణ, జి.కృష్ణమూర్తిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రంక్‌రోడ్ విస్తరణపై అధికారులు, ప్రజాప్రతినిధులు పునఃపరిశీలన చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

మద్దిపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని రెబ్బవరపు ప్రభాకర్ కోరారు. ఆదివారం మద్దిపాడులో ఎమ్మార్పీఎస్ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 7వ తేదీన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి మాదిగపల్లెలో జెండా ఆవిష్కరణలు నిర్వహించాలని, ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు అల్పాహారం అందజేయాలని చెప్పారు. సమావేశంలో మందా చిన్నయ్య, సిరిమల్ల ఆదాము, వినోద్‌కుమార్, దుద్దుకూరి డేవిడ్, తాతపూడి నాగరాజు, గర్నెపూడి రామారావు, పొదిలి సుధాకర్‌బాబు, పౌల్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

మద్దిపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ కె.సుబ్బారావు అన్నారు. ఆదివారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నేలటూరి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. పీవీ.రాఘవరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో గంగిశెట్టి నరసింహారావు, గంటా కోటేశ్వరరావు, అన్నమనేని కోటేశ్వరరావు, కటకం వెంకటేశ్వర్లు, దిద్ది రామారావు, షేక్ కలాం, ఎస్కే.షరీఫ్, శుద్దపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర నష్టం

నాగులుప్పలపాడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు పేర్కొన్నారు. ఉప్పుగుండూరులోని రజక కళ్యాణమండపంలో ఆదివారం జరిగిన సమావేశం ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూబాటి శ్రీకాంత్, నలతోటి రామారావు, జి.బసవపున్నయ్య, కార్మికులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఫలితాల్లో సత్తా చాటిన సాత్విక


గ్రూప్-1కు ఎంపికైన సాత్విక

రాచర్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలం యడవల్లి గ్రామానికి చెందిన కటకం సాత్విక తెలంగాణ గ్రూప్-1 ఫలితాల్లో సత్తా చాటింది. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1లో సాత్విక 440వ ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్ హోదా సాధించింది. గ్రూప్-1 ఫలితాల్లో ఘన విజయం సాధించిన సాత్వికకు మండల ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, విద్యాశాఖ అధికారులు గిరిధరశర్మ, శివకోటేశ్వరరావు, ఎస్ఐ కోటేశ్వరరావు, గ్రామస్థులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు. తమకుమార్తె కృషి, పట్టుదలతో చదివి గ్రూప్-1కు ఎంపిక కావడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని సాత్విక తల్లిదండ్రులు విద్యాసాగర్, నాగేంద్రమ్మ అన్నారు.

సమగ్ర శిక్ష బదిలీల తుది సీనియారిటీ జాబితా

ఒంగోలు విద్య, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీల సీనియారిటీ జాబితా విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. తుది జాబితాను ప్రకాశంఏపీ గవర్నమెంట్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. జిల్లా, మండలస్థాయి బదిలీలకు పలువురు దరఖాస్తుచేయగా వీరికి జిల్లాస్థాయి కమిటీ కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలు కేటాయించి బదిలీ ఉత్తర్వులు జారీచేస్తారు. అంతర్ జిల్లాల బదిలీలకు దరఖాస్తు చేసుకున్న 19 మందిలో ఆరుగురిని వారు కోరుకున్న స్థానాలకు బదిలీచేస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. వీరిని రిలీవ్ చేసి పంపించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

నేటినుంచి పాలిటెక్నిక్ వెబ్ ఆప్షన్లు

ఒంగోలు విద్య, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు కళాశాలలను, కోర్సులను ఎంపిక చేసుకోనేందుకు సోమవారంనుంచి వెబ్‌ఆప్షన్లు ప్రారంభం కానుంది. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగిసింది. పాలిసెట్ కన్వీనర్ మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 25నుంచి విద్యార్థులు వెబ్‌ఆప్షన్ పెట్టుకోవాల్సి ఉంది. అయితే కళాశాలల అఫిలియేషన్ మంజూరులో జాప్యం కావడంతో వెబ్‌ఆప్షన్లను వాయిదావేస్తూ పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్లకు సమాచారం పంపారు. ఆ సమాచారంలో ఈనెల 30నుంచి విద్యార్థుల ప్రవేశాల కోసం వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవాలని పేర్కొన్నారు. అయితే పాలిసెట్ కన్వీనర్ మళ్లీ అధికారికంగా వీరికి వెబ్ ఆప్షన్ల షెడ్యూల్ వివరాలు ప్రకటించారు. అయితే తొలి షెడ్యూల్‌లో మొదటి రెండు రోజులు 1నుంచి 50వేల ర్యాంకు వరకు విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవచ్చు. అయితే వెబ్‌ఆప్షన్లు సోమవారం నుంచి ప్రారంభం అవుతాయా మళ్లీ వాయిదాపడుతాయా అనేది వేచిచూడాలి.

గూడేలలో గుబులు

- పులులదాడితో బెంబేలు
- వరుస ఘటనలతో ఆందోళన
- ఈనెలలోనే రెండుసార్లు విసిరిన పంజా
- నాలుగు ఆవుల మృత్యువాత

గిరిజన గూడెం (ఫైల్)



త్రిపురాంతకం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంత గూడేలలో గుబులు రేగుతోంది. ఎప్పుడు పెద్దపులులు ఎటువైపు నుంచి దాడి చేస్తాయో అని ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితులు వస్తున్నాయని చెప్తున్నారు. ముఖ్యంగా ఎర్రగొండపాలెం మండల పరిధిలో నల్లమల అడవిలో ఉన్న పాలుట్ల గిరిజన గూడెం ఇప్పుడు భయంతో వణుకుతోంది. ఈనెల 13వ తేదీన పాలుట్ల గూడెంలో ఆవులమంద దొడ్డిపై పెద్దపులి దాడి చేసి రెండు ఆవులను చంపింది. తాజాగా మళ్లీ శనివారం రాత్రి ఆవులు ఉన్న దొడ్డిపై పులి దాడి చేసి గ్రామానికి చెందిన కె.నానికేనాయక్‌కు చెందిన రెండు ఆవులను చంపివేసింది. రాత్రి 9 లేదా 10 గంటల సమయంలోనే మైదాన ప్రాంతానికి పులులు వచ్చి దాడులు చేస్తుంటే అర్ధరాత్రులు గూడెంపై దాడి చేస్తే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఈ ఏడాదిలో ఎక్కువ పర్యాయాలు మార్కాపురం డివిజన్‌లోని పలు పల్లెలపై పులి పంజా విసరటంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. అడవిని వదిలిన పులులు మైదాన ప్రాంతాలకు రావటం ఆందోళన కలిగిస్తున్నది.

ప్రొటెక్షన్ వాచర్లు సీసీ కెమెరాలకు దొరకడం లేదా?

నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంరక్షణ చర్యల్లో భాగంగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసింది. పెద్దన్న క్యాంప్, ఇష్టకామేశ్వరి, దొరబైలు, తుమ్మలబైలు, చిన్నమంతనాల, కొర్రప్రోలు, రోళ్లపెంట నారుతడికల, పాలుట్ల , కొలుకుల తదితర చోట్ల బేస్‌క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ బేస్ క్యాంపుల్లో ప్రతిచోట ఐదు మంది అటవీశాఖ అధికారులు ఉంటారు. వీళ్లు కాకుండా మార్కాపురం అటవీశాఖ పరిధిలో మొత్తం 120 మంది ప్రొటెక్షన్ వాచర్లు ఉన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎప్పటికప్పుడు నిఘా ఉంటుంది. పైగా వన్యప్రాణుల రక్షణలో భాగంగా కొర్రప్రోలు, గుంటూరు జిల్లా శిరిగిరి పాడు, దోర్నాల వద్ద గణపతి చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘాకు కూడా ఈ పులులు చిక్కటం లేదా? ప్రొటెక్షన్ వాచర్ల పర్యవేక్షణ ఎంతవరకు సజావుగా సాగుతుంది అనే సందేహాలు కలుగుతున్నాయి.

అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పులుల సంచారంపై జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు చెప్తున్నప్పటికీ ఏ సమయంలో ఎటువంటి పరిస్థితులు ఎదురవుతాయో అని గిరిజనులు భయం గుప్పిట్లో ఉన్నారు.

ఇటీవల జరిగిన పలు ఘటనలు

- ఏప్రిల్ 10వ తేదీన పెద్దారవీడు మండలం కలనూతల గ్రామ సమీపంలో పెద్దపులి దాడితో గేదె చనిపోయింది.
- ఏప్రిల్ 30వ తేదీన మాగుటూరు తాండా సమీపంలో పులి దాడికి గేదె మృత్యువాత పడింది.
- మే 30వ తేదీన అర్ధవీడు మండలం పాపినేనిపల్లి సమీపంలో బొప్పాయితోటలో ఉన్న ఆవుపై పెద్దపులి దాడిచేసి చంపింది.
- ఈనెల 6వ తేదీన మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామ సమీపంలో గేదెపై పెద్దపులి దాడి చేసి చంపింది.
- ఈనెల 10న అర్ధవీడు మండలం బొల్లుపల్లికి చెందిన రైతు నాగేశ్వరరావు ఎద్దుపై దాడిచేసిన పెద్దపులి
- ఈనెల 13న ఎర్రగొండపాలెం మండలం పాలుట్ల గూడెంలో పెద్దపులి దాడిలో రెండు ఆవులు మృతి చెందాయి.
- ఈనెల 28న పాలుట్లలో రెండోసారి పులి దాడిచేసి రెండు ఆవులను చంపివేసింది.


మొదటి బహుమతి పొందిన ఒమ్మేపురం జట్టుకు బహుమతిని అందజేస్తున్న దాతలు

పూనూరులో ముగిసిన క్రికెట్ పోటీలు

యద్దనపూడి,(మార్టూరు)జూన్29(ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుండి యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో వైఎంసీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలలో మొదటి బహుమతిని పొందిన అనిల్ ఫ్రెండ్స్ యువత ఒమ్మేవరం జట్టుకు పోపూరి లింగయ్య రూ.20116 రులను బహుమతిగా అందచేశారు. అదేవిధంగా రెండవ బహుమతిని వైఎంసీఏ పూనూరు జట్టు గెలుచుకోగా వారికి రూ.15116లను మేక దేవసహాయం అందచేశారు. మూడవ బహుమతిని ఏవైఎఫ్ యద్దనపూడి జట్టు గెలుచుకోగా వారికి రూ.10116 లను అల్లాడి వరప్రసాద్ అందచేశారు. నాల్గవ బహుమతిని మాస్టర్ ఎలవెన్స్ పూనూరు జట్టు గెలుచుకోగా వారికి రూ.5116 లను రాయి వేణు అందచేశారు. మ్యాన్ ఆఫ్ మ్యాచ్ అవార్డును డేవిడ్ అందుకున్నారు. కార్యక్రమంలో చిన్నా, వీరాస్వామి, రోజారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందుకుంటున్న రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, అద్దంకి సభ్యులు

రోటరీ సేవలకు అవార్డుల పంట

అద్దంకిటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, అద్దంకి చేసిన సేవాకార్యక్రమాలకు సభ్యులకు అవార్డుల పంట పండింది. హైదరబాద్‌లో ఆదివారం జరిగిన అవార్డు నైట్ కార్యక్రమంలో భాగంగా రోటరీ -3150 జిల్లాలోనే అత్యధిక సేవా కార్యక్రమాలు చేసిన అద్దంకిలోని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండకు రెండు గోల్డెన్ ఛాంపియన్ అవార్డులు, మూడు సిల్వర్ అవార్డ్‌లు దక్కాయి. ఎక్కువ రక్తదానం చేయించిన క్లబ్ సెక్రటరీ చుండూరి మురళి సుధాకరరావుకు ప్రత్యేకంగా అవార్డు అందజేసి సత్కరించారు. వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య)కు పిల్లర్ ఆఫ్ ది క్లబ్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. మరో పది సేవా పత్రాలను క్లబ్ సభ్యులకు క్లబ్ జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, అద్దంకి లేవి ప్రసాద్; నందిరెడ్డి శ్రీనివాసరావు, పట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ రామకోటేశ్వరావు, అంజాద్ బాషా, జాగర్లమూడి శివకుమారి, కోట అంజమ్మ, కుంచాల శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కంభం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కంభం పాలిటెక్నికల్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకగా జరిగింది. పూర్వ విద్యార్థులందరూ నాడు చదువులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. 39 సంవత్సరాల కిందట 1986లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పలువురు విద్యార్థులు కంభం పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చి విద్యను అభ్యసించారు. వారంతా చదువును పూర్తి చేసుకుని ఉద్యోగ, వ్యాపార రంగాలలో పలు చోట్ల స్థిరపడ్డారు. నాటి స్నేహితులను కలుసుకోవాలని తలంచి అందరి సమాచారం తెలుసుకుని పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకచోట కలవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఈ సందర్భంగా ఎస్‌వీకేపీ పాలిటెక్నికల్ కరస్పాండెంట్ రావూరి జనార్దన్, పూర్వ ప్రిన్సిపాల్ కృష్ణశాస్త్రి, లెక్చరర్లు అజయ్‌బాబు, శేషగిరి, ప్రసాద్‌గుప్తా, శివప్రసాద్, శ్రీనివాసులను సత్కరించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ సాయిబాబా ఇప్పుడు చదువుతున్న విద్యార్థులకు టీసీఎస్, డెల్ లాంటి కంపెనీల్లో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులతో భవిష్యత్ ప్రణాళికలకు సలహాలు, సూచనలు ఇప్పించారు. ఈ అపూర్వ కలయికకు సహకరించిన డీఎస్ఎస్ఎన్‌చారి, కరణం సురేష్, కె.శ్రీనివాసులు, డాక్టర్ గిరిధర్, రాజేశ్వరరావు, డాక్టర్ శేఖర్‌ను అభినందించారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

కదిలిన జగన్నాథ రథ చక్రాలు

కంభం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కంభంలో ఆదివారం సాయంత్రం గచ్చకాలువ నుంచి వేంకటేశ్వరస్వామి దేవాలయం వరకు సాగిన జగన్నాథ రథయాత్రకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం 3గంటల నుంచి 6గంటల వరకు జరిగిన ఈ రథయాత్రలో శ్రీకృష్ణ రక్షణ కంకణ, జగన్నాథ బ్రహ్మోత్సవం, మహాజగన్నాథ్ పూరీ నా మార్చన, పుష్పసేవ అనంతరం సాయం త్రం 6గంటల నుంచి 8గంటల వరకు భారత నదీ జలాలతో సంప్రోక్షణ, మహానరసింహ కుంభ పూజ, మహాపుష్పాభిషేకం, జగన్నాథ్‌పూరి హారతి సంకీర్తన, నృత్యాలు, తులసి భక్తిదేవి ఆహ్వాన యజ్ఞం నిర్వహించారు. రాత్రి సుదర్శన నరసింహ కవచం సంకీర్తన, జగన్నాథ్ లీలాప్రవచనం, హరేక్రిష్ణ మహామంత్ర జప యజ్ఞం, కృష్ణ బలరాముల పల్లకి ఉత్సవం జరిగింది. జగన్నాథ రథయాత్ర పట్టాభిరామ స్వామి దేవాలయం మీదుగా మేదరవీధి, తెలుగువీధి, కాపవీధి, వేంకటేశ్వరస్వామి దేవాలయం వరకు కొనసాగింది.


జగన్నాథుని రథయాత్రలో పాల్గొన్న భక్తజనం

ఆస్తి వివాదంలో మహిళా ఆత్మహత్యాయత్నం

మద్దిపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్లసముద్రంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం నేపథ్యంలో ఒక మహిళ నిద్రమాత్రలు మింగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన దేవరపల్లి లక్ష్మీనరుసు, రామిరెడ్డి ఇద్దరు అన్నదమ్ములు. వీరిద్దరికి కెల్లంపల్లి రహదారిలో పొగాకు బ్యారన్, మరొకచోట 10సెంట్ల స్థలం ఉంది. ఆస్తి తగాదాల నేపథ్యంలో పొగాకు బ్యారన్‌కు తాళాలు వేసుకున్నారు. గతనెల 23వతేదీన తమ్ముడు రామిరెడ్డి అన్న భార్యపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. బాధితురాలు మద్దిపూడి పోలీస్‌స్టేషన్‌లో మరిది రామిరెడ్డి, తోడికోడలు లక్ష్మీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ బాబు గత నెల 29న తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం అన్నదమ్ముల మధ్య మరోమారు వాగ్వివాదం చోటుచేసుకోవడంతో అప్పట్లో పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. బ్యారన్ ఒకరికి, 10సెంట్ల ఖాళీ స్థలం మరొకరు పంచుకునేవిధంగా ఒప్పందం జరిగింది. గ్రామస్థుల సమక్షంలో జరిగిన ఒప్పందాన్ని ఉల్లంఘించి మళ్లీ గొడవ పడటంతో శనివారం అన్న లక్ష్మీనరుసు మరో మారు పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో రాత్రి పోలీసులు గ్రామానికి చేరుకొని రామిరెడ్డి, ఆయన భార్యను స్టేషన్‌కు రావాలని పిలిచారు. ఆదివారం ఉదయం వస్తామని పోలీసులకు సమాధానం చెప్పి పంపించారు. ఆదివారం ఉదయం ఇంట్లో ఉన్న నిద్రమాత్రలను వేసుకొని లక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. హుటాహుటిన ఆమెను పొదిలిలోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈకేసులో తమను ఎస్ఐ వేధిస్తున్నారంటూ ఆమహిళ ఆరోపిస్తోంది. అయితే తాను ఆమెను స్టేషన్‌కు పిలిపించానని వారు రాకుండా తనపై ఆరోపణలు చేయడం సరికాదని ఎస్ఐ రమేష్ బాబు వివరణ ఇచ్చారు. సివిల్ వివాదంలో తాను జోక్యం చేసుకోబోనన్నారు.


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ లక్ష్మి

బదిలీ టీచర్ల జీతాలకు లైన్ క్లియర్

ఒంగోలు విద్య, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇటీవలజరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఇతర పాఠశాలలకు బదిలీఅయిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు లైన్ క్లియర్ అయింది. జూలై మాసంలో వీరికి జీతాలు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో టీచర్ల బదిలీలు జరిగినప్పుడు టీచర్లకు రెండు,మూడు నెలలు జీతాలు చెల్లించేందుకు సమస్యలు ఎదురయ్యేవి. అయితే ప్రస్తుతం టీచర్లబదిలీలు ఆన్‌లైన్‌లో నిర్వహించడంతో పాఠశాలల కొత్త కేడర్ స్ట్రెంత్ నిర్ధారణ డీఈవో కార్యాలయ ఐటీసెల్‌కు వచ్చింది. ఆన్‌లైన్‌లో ఏ టీచర్ పాఠశాల నుంచి ఏ పాఠశాలకు బదిలీ అయింది వివరాలు ఉన్నాయి. ఆ వివరాలతో టీచర్లు ట్రెజరీ ఐడీ నెంబరు కూడా ఉండటంతో టీచర్లు భారీ సంఖ్యలో బదిలీ అయినా వారి నిర్ధారణ తేలికగా పూర్తయింది. ఈనెల 30లోపు పాఠశాలల కొత్త కేడర్ వివరాలు ధ్రువీకరించాలని పాఠశాల విద్యాడైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. దీంతో శనివారమే కొత్త కేడర్ వివరాలను ఉప విద్యాధికారులు మండల విద్యాధికారులు ధ్రువీకరించారు. దీంతో పాఠశాలల కొత్త కేడర్ వివరాలు పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం నుంచి డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ కార్యాలయానికి చేరనున్నాయి. ఆ వివరాలు డీటీఏ నుంచి ఇక్కడి జిల్లా ట్రెజరీ కార్యాలయానికి అందితే వెంటనే జీతాల బిల్లులు మంజూరుకు అవకాశం ఉంది. 117 జీవో రద్దు అనంతరం పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా జిల్లాలోని 85 యూపీస్కూళ్లను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటిలో 28 పాఠశాలలకు కొత్త హెచ్‌ఎం పోస్టులు మంజూరయ్యాయి. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు జీతాలు చెల్లించేందుకు కొత్తగా డీడీవో కోడ్‌నెంబర్లు కేటాయించాలని పాఠశాల విద్యాకార్యదర్శి కోన శశిధర్ డీటీవోలకు ప్రతిపాదనలు పంపారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు మంజూరుచేశారు. ఈపాఠశాలలకు అదనంగా ఎస్‌జీటీలనుకూడా నియమించారు. జిల్లాలో 104 మంది గ్రేడ్-2 హెచ్‌ఎంలు, 2,586 మంది ఎస్‌జీటీ తెలుగు , 59 మంది ఎస్‌జీటీ ఉర్దూ, 145 మంది పీఎస్‌హెచ్‌ఎంలు, 1,154 మంది నాన్‌లాంగ్వేజెస్ స్కూలు అసిస్టెంట్లు, 647 మంది లాంగ్వేజ్ స్కూలు అసిస్టెంట్లు, 805 మంది ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు కొత్తగా పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేశారు. ఈ పోస్టుల్లో 404 మంది మిగులు స్కూలు అసిస్టెంట్లను నియమించారు. ఈ వివరాలన్నింటితో కొత్త కేడర్‌ను నిర్ధారించి ధ్రువీకరించి కమిషనర్ కార్యాలయానికి పంపించారు. ఏదిఏమైనా జూన్ నెలలో బదిలీ టీచర్లందరికీ జీతాలు చెల్లించాలని ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోంది.

కారు, బైక్ ఢీ - ఒకరికి గాయాలు

బల్లికురవ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అద్దంకి నార్కెట్ పల్లి రాష్ట్రీయ రహదారి వైదన క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న బైకును వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈప్రమాదంలో బైకిస్టు శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి.

అందిన సమాచారం మేరకు పల్నాడు జిల్లా నూజెళ్లపల్లి మండలం ములకలూరుకు చెందిన కే.శ్రీనివాసరావు అనే వ్యక్తి అద్దంకి మండలం శంకవరప్పాడుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి తిరిగి వెళుతున్నాడు. నామ్ రోడ్డులోని వైదన క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న శ్రీనివాసరావు కాళ్లకు తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే బల్లికురవ 108 సిబ్బంది క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం నర్సారావుపేట వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యుల పరిస్థితి విషమంగా ఉందని చెప్పగా వెంటనే గుంటూరు వైద్యశాలకు తరలించారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు (ఇన్‌సెట్లో) అపస్మారక స్థితికి చేరిన బైకిస్టు శ్రీనివాసరావు

పంట కాలువలపై పాగా



ఆర్టీసీ బస్టాండ్ ముందు వైపు ఉన్న పంటకాలువను ఆక్రమించి కట్టిన కట్టడం



నక్కలగండి కాలువపై నిర్మించిన పక్కాగృహాలు

» యథేచ్ఛగా ఆక్రమణలు, ఇళ్ల నిర్మాణాలు
» పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

కంభం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : చారిత్రాత్మక కంభం చెరువు పంట కాలువలు ఆక్రమణలకు గురవుతున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కొందరు యథేచ్ఛగా అక్రమ కట్టడాలు, చప్టాలను నిర్మించారు. దీనితో కాలువల్లో పూడిక తీసేందుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడడేకాక పొలాలకు నీరు సక్రమంగా వెళ్లేందుకు దారిలేదు. ఇప్పటికే నక్కలగండి కాలువకు ఇరువైపులా ఆక్రమించి గృహాలు నిర్మించుకున్నారు. అప్పట్లో ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాల పేరుతో ఆర్టీసీ బస్టాండ్ ముందు వైపు, రావిపాడు వెళ్లే మార్గంలో చప్టాలను, అంతస్తులను నిర్మించారు. ఇదే విధంగా నిర్మాణాలు కొనసాగితే కొంత కాలానికి కాలువలన్నీ మాయమవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూములను ఎత్తేందుకు గతంలో జీపులు, లారీలు వెళ్లేవని, ప్రస్తుతం ఆక్రమణల వలన నడిచేందుకు కూడా వీలులేదని రైతులు చెప్తున్నారు. ఈవిషయంపై ఎన్నోసార్లు కలెక్టర్లకు ఫిర్యాదు చేసినా, అప్పటి కలెక్టర్ల ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ లక్ష్మీనరసింహ కంభం వచ్చి ఇరిగేషన్ అధికారులు, రైతులతో కలిసి పంట కాలువలపై ఉన్న అక్రమ కట్టడాలను పరిశీలించారు. అప్పటి ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. నెల రోజుల్లో పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగిస్తామని ఇరిగేషన్ డీఈ రఘునాథరెడ్డి తెలిపారు. ఆ తరువాత ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కారణం ఇరిగేషన్ అధికారుల వద్ద పంట కాలువలకు సంబంధించిన స్థలాల వివరాలు, మ్యాప్ లేకపోవడం వలనే ఆక్రమణలకు గురవుతున్నా నోరు మెదపడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వారాహి అలంకరణలో జగదాంబకు పూజలు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో వారాహి నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం జగదాంబ మాత ఉత్సవమూర్తికి కిరాత వారాహి అలంకారం నిర్వహించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఎర్రగొండపాలెం : వారాహి అమ్మవారు ఉన్మత్త రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ ఆలయం నుంచి 50 మందికిపైగా మహిళా భక్తులు చీర, పసుపు, కుంకుమలతో ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు.

విశ్వబ్రాహ్మణులు అన్నింటిలో అభివృద్ధిలో చెందాలి



మాట్లాడుతున్న జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ కోశాధికారి

పొదిలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణులు అన్నింటిలో అభివృద్ధి చెందాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదుమూడి రవిప్రసాద్ అన్నారు. ఆదివారం పొదిలిలోని సామిల్‌లో జిల్లా కోశాధికారి రాచర్ల శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదుమూడి రవిప్రసాద్ మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండాలన్న ఆశయంతో సంఘం పనిచేస్తుందన్నారు. ఇప్పటికే సంఘం ఆధ్వర్యంలో సుమారుగా రూ.40లక్షల వరకు దాతల ద్వారా సేకరించి పేద విశ్వబ్రాహ్మణులకు సాయం అందించామని తెలిపారు. ఆదివారం పేద విద్యార్థికి రూ.11వేల సాయం అందజేశామన్నారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కోశాధికారి రాచర్ల శేఖర్ మాట్లాడుతూ పొదిలిలో ఆరామ క్షేత్రాన్ని ప్రభుత్వం నిర్మించాలని ఆయన కోరారు. నామినేటెడ్ పదవుల్లో విశ్వబ్రాహ్మణలకు సముచిత స్థానం కల్పించేందకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చొరవ చూపాలన్నారు. అనంతరం జిల్లా కమిటీలో బాధ్యతలు చేపట్టిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు, మహిళా అధ్యక్షులు గుత్తికొండ కల్యాణ్, సామంతపూడి విజయలక్ష్మి, సంఘ నాయకులు నిమ్మల సూర్యం, బాలసుబ్రమణ్యం, రాచర్ల బ్రహ్మం, ఉప్పుటూరి రంగస్వామి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గిద్దలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. భార్గవి, శిరి, రంగప్రణీత్ మొదటి మూడు స్థానాలు సాధించగా యువ ప్రగతిపథం సంస్థ ప్రతినిధి పీరయ్య బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్ పాల్గొన్నారు.

కట్టుదాటితే కఠిన చర్యలు

రౌడీషీటర్లు, పోకిరీలకు సీఐ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రౌడీషటర్లు, చెడునడత కలిగిన పోకిరీ వాళ్లు ఎవరైనా సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ పి.సుబ్బారావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ ఒకప్పుడు తప్పులు చేసి షీట్లు నమోదు చేయించుకున్న వాళ్లు మళ్లీ దారిలోకి రావద్దన్నారు. ముఖ్యంగా సంఘ వ్యతిరేక కార్యకలాపాల జోలికి వస్తే సహించేదిలేదన్నారు. పట్టణ శివార్లలో గంజాయి, మద్యం సేవించి సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి వారిని ఉపేక్షించేదిలేదన్నారు. వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాల్సి ఉంటుందన్నారు. మీపై ఎల్లప్పుడు పోలీసుల పర్యవేక్షణ ఉంటుదనే విషయాన్ని మరువరాదన్నారు. మంచి నడవడిక అలవాటు చేసుకుని రుజుమార్గంలో పచనించాలన్నారు. యువత చెడు వ్యసనాలు వీడకుంటే జీవితాలు సర్వనాశనమవుతాయన్నారు. మీరు ఇబ్బందులు పడడంతోపాటు కన్నవారికి కూడా కష్టాలు తీసుకురావద్దని అన్నారు. పలురకాల షీట్లు కలిగిన వాళ్లు సత్ప్రవర్తనతో ఉంటే గమనించి షీట్లు ఎత్తివేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు, డాక్టర్ రాజమోహన్ పాల్గొన్నారు.

పోలేరమ్మకు జాతర



మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ శివారులలోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రాక్‌వెల్ స్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న స్కూల్ యాజమాన్యం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని రాక్‌వెల్ స్కూల్‌కు నేషనల్ స్కూల్ అవార్డు ఫర్ స్కూల్ విత్ బెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-2025 అవార్డు లభించింది. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్‌లు వెన్నా నాగార్జునరెడ్డి, సింధూజ ఈ అవార్డును అందుకున్నారు.

కొలువుదీరిన పీర్లు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కులమతాలకు అతీతంగా నిర్వహించుకునే మొహర్రం వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. మార్కాపురం పట్టణంలోని పీర్ల మకానాలలో పీర్లను కొలువుదీర్చారు. ప్రసిద్ధి చెందిన గొర్లగడ్డ పీర్ల చావిడిలో బారా ఇమామ్, బాదుల్లా సాహెబ్, కాశింసాహెబ్, ఇమామ్ రంగూ హుస్సేనీ, ఇమామ్ హుస్సేన్ పీర్లు కొలువుదీరాయి. బుధవారం మధ్యాహ్నం కాశింసాహెబ్ పీరుకు పగలు ఉత్సవం, బాదుల్లా సాహెబ్ పీరుకు శనివారం రాత్రి చిన్న షరిగెత్, ఆదివారం పెద్ద షరిగెత్, 7వ తేదీ సహాదత్(పీర్లను నీళ్లలో ముంచే కార్యాక్రమం) నిర్వహిస్తున్నట్లు ముజావర్లు తెలిపారు. తూర్పు వీధిలో చిన్న బాదుల్లా సాహెబ్, విజయ టాకీస్, నాగులవరం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, రాజీవ్ కాలనీలలో పీర్లు కొలువుదీరాయి.



గొర్లగడ్డ పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లు



సర్టిఫికెట్‌లను పరిశీలిస్తున్న సిబ్బంది

జాబ్‌మేళాకు స్పందన

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ శ్రీ సాధన డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాకు భారీ స్పందన లభించింది. ఐటీ రంగానికి చెందిన కంపెనీలు నియామక ప్రక్రియలో పాల్గొన్నాయి. డిగ్రీతో పాటు ఇంజనీరింగ్ తదితర సాంకేతిక కోర్సులు చేసిన 200 మంది ఆశావాహులు పాల్గొన్నారు. మౌఖిక పరీక్ష నిర్వహించి 74 మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ జింకా రవితేజ, కోఆర్డినేటర్ షేక్ ఫిరోజ్ గాంధీ, కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.మధుసూదన్, కళాశాల టీపీవో పవన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

గిద్దలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థ ఛైర్మన్‌గా పాలుగుళ్ల వెంకట శివారెడ్డి, అధ్యక్షులుగా మాలపాటి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యల్లా శ్రీనివాసులు, కోశాధికారిగా దగ్గుపాటి వెంకటేశ్వర్లు, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి సంస్థ జిల్లాశాఖ అధ్యక్షులు సోమిశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కె.యలమందరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లు రద్దు చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి అన్నారు. యూటీఎఫ్ కార్యాలయంలో సీఐటీయూ మార్కాపురం ప్రాంతీయ మండలాల సమావేశం ఆదివారం సుబ్బరాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ.. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలు, పని గంటల పెంపు వ్యతిరేకించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. స్కీమ్ వర్కర్‌లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఐకేపీవీవో, ఏఆర్‌పీ, స్కూల్ శానిటేషన్ కార్మికులు చాలిచాలని వేతనాలతో దుర్భర జీవితం సాగిస్తున్నారని, వారికి కనీస వేతన చట్టం అమలు చేసి రెగ్యులర్ చేయాలన్నారు. జూలై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, పట్టణ కార్యదర్శి రూబెన్, నాగరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

రాచర్ల : కార్మిక చట్టాలను కాలరాసే కార్మిక కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సభ్యులు ఆవులయ్య అన్నారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావంగా కార్మికుల సహకారం అందించాలని ఆదివారం ఆయన రాచర్లలో వివిధ కార్మిక సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సంతోష్ కుమారి, గురవయ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు.

తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్ల నియామకం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్‌గా పనిచేయటానికి ఉత్సాహవంతులైన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మార్కాపురం పోస్టల్ సూపరింటెండెంట్ గ్రంధే శ్రీనివాసులు తెలిపారు. దరఖాస్తు నమూన మార్కాపురం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం, మార్కాపురం డివిజన్‌లోని ఏ పోస్టాఫీసు నుంచైనా పొందవచ్చని, ఆసక్తి గల అభ్యర్థులు వారి బయోడేటా, వయస్సు, విద్యార్హత తదితర ధ్రువీకరణ పత్రాలు ఏదైనా అనుభవ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 30లోపు మార్కాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కార్యాలయానికి పంపించాలని, టెన్త్ ఉత్తీర్ణులై 18-50 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు.

110మందికి వైద్య పరీక్షలు

పెద్ద దోర్నాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతల గిరిజన గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చింతలలోని ప్రథమిక ఆరోగ్య కేంద్రంలో గుంటూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని చింతల వైద్యాధికారి యాగ్నిక్ ప్రారంభించారు.ఈ శిబిరంలో 110మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారు.వీరిలో 32 మందికి శస్త్ర చికిత్స అవసరంగా గుర్తించారు. శంకర్ ఆసుపత్రి యాజమాన్యం జూలై 2వ తేదీన వీరిని సొంత ఖర్చులతో గుంటూరుకు తరలించి చికిత్సలనంతరం తిరిగి చింతలకు తీసుకురానున్నట్లు శంకర్ ఆసుపత్రి మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా మండలంలోని కొర్రప్రోలులో కూడా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 85 మంది రోగులు హాజరయ్యారు. వీరిలో 32 మంది రోగులకు శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు గుంటూరుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

పెద్ద దోర్నాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా దూసుకువస్తున్న కారు వేగాన్ని చూసి భయపడి పక్కకు తప్పించబోయి మోటారుసైకిలిస్టు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో మంగళగిరికి చెందిన నరహరి సురేష్, అతని భార్యకు గాయాలయ్యాయి. ఈ ఘటన కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై హసనాబాద్ స్టేజ్ వద్ద జరిగింది. సురేష్ దంపతులు మంగళగిరి నుంచి మోటారు సైకిల్‌పై శ్రీశైలం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

37 వాహనాల గుర్తింపు

పొదిలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : టైలర్స్ కాలనీలో ఆదివారం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కాలనీలో గృహాల్లో అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను పరిశీలించారు. కొత్తగా కనిపించిన వారిని ప్రశ్నించారు. గృహాలను తనిఖీ చేసే క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న 37 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, ఒక కారును డీఎస్పీ గుర్తించారు. వాహనాల పత్రాలను క్షుణ్నంగా పరిశీలించాలని సీఐ వెంకటేశ్వరరావు సిబ్బందికి సూచించారు. పత్రాలే లేని వాహనాలను సీజ్ చేసి, స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పొదిలి, తర్లుపాడు ఎస్‌ఐలు వేమన, బ్రహ్మానాయుడు సిబ్బంది పాల్గొన్నారు.



కార్డెన్‌సెర్చ్‌లో బయటపడిన వాహనాలు

కార్మిక వ్యతిరేక విధానాలపై సమ్మె

దొనకొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోది ప్రభుత్వం కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోది అధికారంలోకి వచ్చిన పదకొండు సంవత్సరాల్లో దేశంలో అసమానతలు బాగా పెరిగాయన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వం రద్దు చేసి కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. జూలై 9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కర్నా హనుమయ్య, కుందుర్తి చిన్ననర్సింహులు, కోలా కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం

దర్శి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ దర్శి మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తూము శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నక్కా కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా వి.వెంకటేశ్వర్లు, వై.రాజశేఖర్‌రెడ్డి, వీరతం నారాయణ, సీహెచ్ అనిత, కార్యదర్శులుగా బీవీఎల్ నారాయణ, పి.నజీర్, ఎం.రఘురామిరెడ్డి, ముత్యాల శ్రీనివాసరావు, సీహెచ్ వరలక్ష్మి ఎన్నికయ్యారు. అలాగే, జిల్లా కౌన్సిలర్లుగా ఎల్.వెంకటేశ్వరరెడ్డి, వీవీ నారాయణ, రమణయ్య, వెంకటేశ్వర్లు, సాంబయ్య, అమరా శ్రీనివాసులు, చక్రధర్, జి.వేణు, గోవిందయ్య, ఎం.మంజుల, జి. సులోచన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కూలేదశలో ఓవర్‌హెడ్ ట్యాంకులు

» కాలంచెల్లిన పైపులైన్లు
» ప్రమాదకరంగా మారిన వైనం



దర్శి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దర్శి ఎన్‌ఏపీ స్కీమ్ పరిధిలో సుమారు 45 సంవత్సరాల క్రితం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు కూలేదశకు చేరి ప్రమాద భరితంగా మారాయి. పైపులైన్లు కాలం చెల్లిపోవటంతో సామర్థ్యం కోల్పోయి తరచూ పగిలిపోతున్నాయి. ఓవర్




పైపులైన్లు పగలటంతో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

హెడ్ ట్యాంకుల పిల్లర్లు పూర్తిగా దెబ్బతిని కంకర కూడా లేచిపోయింది. ఈ పరిస్థితుల్లో తాగునీటి సరఫ రాకు తరచూ ఆటంకం కలుగుతుంది. దర్శి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

పూర్తిగా దెబ్బతిన్న పిల్లర్లు

పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎంతోకాలంగా ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదు. ఎప్పుడు కూలి ప్రమాదం జరుగుతుందోనని అక్కడ పనిచేసే సిబ్బంది భయపడుతున్నారు. స్కీమ్ పరిధిలోని అనేక ట్యాంకులు కూడా సామర్థ్యం కోల్పోయి కూలేదశకు చేరాయి. పైపులైన్లు తరచూ పగిలిపోతున్నాయి. సుమారు 45 సంవత్సరాలు క్రితం వేసిన పైపులైన్లు ప్రస్తుతం మరమ్మతులు చేయాలంటే పది అడుగుల లోతు గుంత తీయాల్సి వస్తుంది. పైపులు పగిలిన విషయాన్ని కనుగొనేందుకు కూడా అర్థంకాక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్‌ఏపీ స్కీమ్ అభివృద్ధి పనులకు నిధుల విడుదల కోసం అధికారులు ఎన్నోసార్లు ప్రతిపాదనలు పంపినా



కూలేందుకు సిద్ధంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

ఫలితం లేదు. గత వైసీపీ ప్రభుత్వం అవలంబించిన అస్తవ్యస్త విధానాలతో ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం అధ్వానంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని గాడిలో పెట్టేందుకు ఉన్నతాధికారులు పలుమార్లు పరిశీలించారు. ఎన్‌ఏపీ స్కీమ్ దుస్థితి గుర్తించి అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని, అన్ని ప్రాంతాలకు మంచినీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్జెక్టు టీచర్లు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): కనిగిరి డివిజన్‌లోని అనేక ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ అన్నారు. ఆదివారం సీఎస్‌పురంలో జరిగిన యూనియన్ జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయన్నారు. అధికారులు స్పందించి మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ పి.రాజ్‌కుమార్, తోట శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్‌బాబు, మచ్చ ప్రసాద్, నజీర్‌బాషా, ఇండ్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

దొనకొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటి సంరక్షించాలని తెలుగుదేశం పార్టీ లీగల్‌సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ పేర్కొన్నారు. చంద్రన్న పచ్చదనం కార్యక్రమంలో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాల మేరకు దొనకొండలో ఆదివారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలు నాటి సంరక్షిస్తే భవిష్యత్తు తరాలకు ఎంతోమేలు చేకూర్చుతాయని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, టీడీపీ నాయకుడు షేక్ సుభానీ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు కొనసాగించాలి

పామూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మానవతా సేవ సంస్థ తరుపున ప్రజలకు సేవా కార్యక్రమాలను కొనసాగించేలా కార్యక్రమాలు రూపొందించాలని సంస్థ అధ్యక్షుడు ఎం.ముసలయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దివ్యజ్ఞాన సమాజం మందిరంలో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న షేక్ షాశ్వాటీకి సంస్థ తరుపున రూ.5 వేలు అందజేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 467 మార్కులు సాధించిన నల్లబోతుల లక్ష్మీప్రణవికి సైకిల్ కోసం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో తోట రమేష్, కె.రామిరెడ్డి, వి.వెంకటేశ్వరరెడ్డి, పి. తిరుపతిరెడ్డి, ఎస్.కృష్ణయ్య, బి.రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలుచేయాలి

ముండ్లమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం అమలుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కల్పన డిమాండ్ చేశారు. ఆదివారం ముండ్లమూరులో జరిగిన సీఐటీయూ మండల సమావేశానికి బోడపాటి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కల్పన మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయటంతో పాటు పని గంటలు తగ్గించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. వచ్చే నెల 9న జరిగే జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

గుంటిగంగకు చేరుకున్న పాదయాత్ర

తాళ్లూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలను బీసీలో చేర్చాలని బీసీ రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో చిత్తూరు నుంచి అమరావతికి పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పాదయాత్ర నిర్వహిస్తున్న కాపునేతలు ఆదివారం గుంటిగంగకు చేరుకున్నారు. పాదయాత్రలో పాల్గొన్న సాన ప్రసాద్, తదితరులకు తూర్పుగంగవరం, శివరాపురం కాపు నేతలు ఘనస్వాగతం పలికారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాపు నాయకులు కనిశెట్టి రామలక్ష్మయ్య, తూము రవి, లక్ష్మీనారాయణ, కొనసా గురుబ్రహ్మం, మారెళ్ల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఊటుకూరి కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. అర్హతగల అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో జూలై 3వ తేదీ ఉదయం పది గంటలకు హాజరుకావాలని కోరారు.

కేంద్ర సహకారంతో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే పనులు

పామూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణ పనులు కేంద్ర ప్రభుత్వ సహకారంతో వడివడిగా జరుగుతున్నాయని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. పామూరులోని అగ్రిగోల్డ్ ప్రాంతంలో జరుగుతున్న భూమి చదును పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కొప్పరపు వెంకట సుబ్బారావు, జాజం చినసుబ్బయ్య, పాడే అరవింద్, లు ఉన్నారు.

మందుబాబులకు కౌన్సెలింగ్

ముండ్లమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ గ్రామంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న నలుగురిని ఎస్‌ఐ కె.కమలాకర్ ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వారిపై డ్రంకన్ డ్రైవ్ కింద కేసు నమోదు చేశారు.

చివరి భూములకు నీరు అందించేందుకు కృషి

డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు

ముండ్లమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి మేజరు పరిధిలో మైనర్ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి చివరి భూములకూ నీరందించేందుకు కృషి చేస్తున్నట్టు మోదేపల్లి మేజరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు అన్నారు. మేజరు పరిధిలోని జరుగుతున్న ఆధునీకరణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజరు పరిధిలో శిథిలావస్థకు చేరిన అయోధ్యనగర్, ఈదర మధ్య కాలువపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందన్నారు. బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడలు కూడా లేకపోవటంతో రాత్రుల సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇటీవల ఈఈ రామకృష్ణ, డీఈ పూర్ణచందు మండల అధికారులను తీసుకెళ్లి పరిశీలించి అంచనాలు వేయించి సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు చైర్మన్ పులుకూరి కాంతారావుకు అందజేసినట్టు చెప్పారు.

మేజరు పరిధిలో గాంధీనగరం, వేముల, ఉమామహేశ్వర అగ్రహారం, శంకరాపురం, నాయుడుపాలెం వద్ద శిథిలావస్థకు చేరిన కల్వర్టులు స్థానంలో కొత్తవి నిర్మించేందుకు కృషి చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం మేజరు పరిధిలో పూడుకుపోయిన పూడికతీత, చిల్ల కంప తొలగిస్తున్నట్టు చెప్పారు. అలాగే, వేముల బండ, తూర్పుకంభంపాడు, పోలవరం, శంకరాపురం, ఉమామహేశ్వర అగ్రహారం, భీమవరం, వేముల మైనర్ కాలువలకు గత వారం రోజులుగా మరమ్మతులు చేస్తున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో సాగర్ కాలువల ఆధునికీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక దృష్టిపెట్టి నిధులు మంజూరు చేశారన్నారు. కాలువలను ఆధునికీకరణ చేయటం వల్ల ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు నీరు అందించి రైతుల అభివృద్ధి కృషి చేస్తామన్నారు. త్వరలో ప్రాజెక్టు చైర్మన్ కాంతారావు మేజరు కాలువపై పర్యటించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు.

గుంటి గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తూర్పుగంగవరం పంచాయతీలోని సోమవరప్పాడు పరిధిలోగల గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చల్లగాచూడమని వేడుకున్నారు. గంగమ్మ తల్లిని అధికసంఖ్యలో భక్తులు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. వాహనదారులు వాహన పూజలు చేయించుకున్నారు. భక్తులు కుంకుమపూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకురావటంతో భక్తులతో గుంటిగంగ ప్రాంగణం సందడిగా మారింది. కొందరు భక్తులు గంగమ్మ తల్లికి కానుకలుగా విరాళాలుగా సమర్పించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వర శర్మ భక్తులకు గోత్రనామ పూజలు చేశారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయ శాఖ ఈవో జి.వాసుబాబు, ఆర్‌ప ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

పామూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రమారెళ్ల, సుబ్బక్కపల్లి గ్రామాలకు చెందిన పోలేరమ్మ తల్లి పాలపొంగళ్లను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా మహిళా భక్తులు గుడి ఆవరణలో పొంగళ్లను తయారుచేసి పసుపు కుంకుమలతో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అమ్మవారికి శాంతి పూజలు నిర్వహించారు. కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ జి.దశరథరాములు, జి.నాగమల్లే శ్వరరావు, జి.సుబ్బరాయుడు, పోకా నాయుడుబాబు, రవిశంకర్, పోకా వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండల కేంద్రమైన ముండ్లమూరులోని పోలేరమ్మ అమ్మవారితోపాటు పోలవరం, బొప్పా డివారిపాలెం, శంకరాపురం, పసుపుగల్లు, ఈదర, నూ జెండ్లపల్లి, గ్రామాల్లో వేంచేసి ఉన్న గ్రామ దేవతలైన పోలేరమ్మ, అంకమ్మ, నాంచారమ్మ అమ్మవార్లకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు.



పామూరు: నారాయణస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈవో, తదితరులు

ఘనంగా ఆదివారం పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

సీఎస్‌పురం(పామూరు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయ అర్చకులు నారాయణస్వామికి కుంకుమార్చన విశేష పూజలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరణ చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు స్వామివార్లకు మం గళవాయిద్యాలతో ఆలయ గాలిగోపురం వద్ద నుంచి ప్ర దక్షిణలు చేస్తూ స్వామివార్లకు నైవేద్యం సమర్పించారు. గోశాలలోని గోమాతలకు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు.

అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన చైర్మన్ కొమ్మి నేని చినఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహ బాబు, పామూరు పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'చైతన్య యాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ'

దర్శి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పారాస్పోర్ట్స్ చైతన్యయాత్రను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పేర్కొన్నారు. ఆదివారం దర్శిలో చైతన్యయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పారా క్రీడాకారులకు విద్యార్హతను బట్టి ఎటువంటి అర్హత పరీక్ష లేకుండా మూడుశాతం ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించే అవకాశం కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. పారా క్రీడాకారలు కోసం విశాఖపట్టణంలో రూ.200 కోట్లతో అత్యాధునిక స్టేడియం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ సెక్రటరీ రామస్వామి, శ్రీనివాసగౌడ్, మాల్యాద్రినాయుడు, శ్రీనాధ్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పామూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పామూరు మండలంలో పేకాట, కోడి పందేలు వేస్తున్న వారిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ టి.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుక్కాపురం గ్రామ శివారు ప్రాంతంలో కోడి పందేలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి 14 మంది కోడి పందేపు రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. 8 పందెపు కోళ్లను, రూ.20,150 నగదును స్వాధీనం చేసుకు న్నారు. మరోచోట జరుగుతున్న పేకాట శిబిరంపై దాడిచేసి 8 మంది పేకాట రాయుళ్లను అరెస్టుచేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. వారినుంచి రూ.10,650 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ - పూరిమెట్ల మధ్య ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని సుంకరవారిపాలెం గ్రామానికి చెందిన చొప్పరపు కోటేశ్వరరావు, మరొకరు పూరిమెట్ల వెళ్తున్నారు. అదేసమయంలో ఉమామహేశ్వర అగ్రహారం గ్రామానికి చెందిన కోటి మారెళ్ళ వెళ్తున్నారు. ఈక్రమంలో మారెళ్ళ -పూరిమెట్ల మధ్య ఎదురెదురుగా వాహనాలు ఢీకొనటంతో చొప్పరపు కోటేశ్వరరావు, కోటికి తీవ్రగాయాలయ్యాయి. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన చొప్పరపు కోటేశ్వరరావును మొదట అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ కె.కమలాకర్ పరిశీలించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

పామూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు సయ్యద్ హనీఫ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జాలా అంజయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పామూరులో జరిగిన కార్మిక సంఘాల సమావేశానికి షేక్ ఖాదర్ బాషా అధ్యక్షత వహించారు. హనీఫ్, అంజయ్య మాట్లాడుతూ కేం ద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను రద్దు చేసినట్టు చెప్పారు. సమ్మెకు మద్దతుగా జూలై 6న బైక్ ర్యాలీ నిర్వహించాలన్నారు. సమావేశంలో కె.మాల్యాద్రి, వై.వీరనారాయణ, సుభాని, కె.శంకర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత (అంచనా) 30-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	34	27
తెనాలి	34	27
నరసరావుపేట	35	27
బాపట్ల	36	29
రెంటచింతల	34	27
చీరాల	36	29



రాజధాని పనులపై నేడు సమీక్ష

- అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన
- సీఆర్‌డీఏ అధికారుల నుంచి పనుల వివరాల సేకరణ
- పరిశీలనతో మలివిడత నిధుల విడుదలకు సానుకూలత

విజయవాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల పరిశీలనకు ప్రపంచ బ్యాంకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ మిషన్ టీమ్ విజయవాడ వచ్చింది. ప్రాజెక్టు పనులపై సోమవారం ఈ బృందం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు, అధికారులతో సమీక్ష జరప నుంది. అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన తర్వాత పనులు జరుగుతున్నాయి. వీటిలో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టేవి సింహభాగం ఉన్నాయి. ఈ పనులకు సంబంధించి ప్రపంచబ్యాంకు బృంద సభ్యులు అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటారు. సీఆర్‌డీఏ అధికారులతో సమావేశం తర్వాత ప్రపంచబ్యాంకు బృందం క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించనున్నది. హెచ్‌వోడీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు, అఖిలభారత సర్వీసు (ఏఐఎస్) టవర్లు, మంత్రులు, హెచ్‌వోడీల బంగళాలతో పాటు రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించనున్నది. ఈ పరిశీలనను బట్టి మలివిడత నిధుల విడుదలకు సానుకూలత ఏర్పడుతుంది.

రుణ సంస్థలతో చర్చలు

అమరావతిలో ప్రస్తుతం సొంత నిధులతో చేపడుతున్న ప్రాజెక్టు పనులు, ఇంకా తలపెట్టాల్సిన పనులకు సంబంధించిన నిధుల కోసం సీఆర్‌డీఏ అధికారులు రుణ సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే బ్యాంకుల కన్సార్టియంతో చర్చలు ప్రారంభించారు. బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం ఖాళీ స్థలాల పూచీకత్తుగా రుణాలు ఇవ్వడం జరగదు. ఆ స్థలాల్లో ఏదైనా నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంటే, రుణాలు ఇస్తాయి. ఇప్పటికిప్పుడు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవాలంటే గ్రౌండ్‌వర్క్ చేయాల్సిన అవసరం ఉంది. అందుకే సీఆర్‌డీఏ అధికారులు నిర్మాణ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణల ప్రకారం రెసిడెన్షియల్, కమర్షియల్ స్పేస్ అభివృద్ధికి ముందుకు వచ్చే సంస్థలకు సంబంధించి త్వరగా అగ్రిమెంట్లు కుదుర్చుకోవాలని అధికారులు భావిస్తున్నారు. భూముల్లో నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంటే రుణాలు వచ్చే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఆర్‌డీఏ అధికారులు బ్యాంకింగ్ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

బీవోటీ విధానంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణం

మూడు నెలల్లో అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు(ఐఆర్‌ఆర్)ను పట్టాలెక్కించాలని సీఆర్‌డీఏ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డును పూర్తిగా బీవోటీ విధానంలో నిర్మించాలని నిర్ణయించారు. రాజధాని అమరావతి చుట్టూ వలయాకారంగా 75 మీటర్ల వెడల్పున, 96.25 కిలోమీటర్ల పొడవున నిర్మించే ఇన్నర్ రింగ్‌రోడ్డుకు గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో 3,556.17 ఎకరాలు అవసరమవుతాయి. అమరావతి రెండో దశ భూ సమీకరణ వల్ల గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో 2,400.76 ఎకరాలను సేకరించాల్సిన అవసరం లేకుండా పోతోంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 1,155.41 ఎకరాలను మాత్రం తీసుకో వాల్సి ఉంటుంది. ఈ భూములను కూడా భూ సమీకరణ విధానంలో తీసుకోవాలనుకుంటున్నట్టు సీఆర్‌డీఏ వర్గాలు చెబుతున్నాయి మూడు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసి టెండర్లు పిలవాలనుకుంటున్నారు.

బర్లీకి.. బొనంజా

- రంగంలోకి మార్క్‌ఫెడ్‌తో కంపెనీలూ కొనుగోళ్లు
- ఆశాజనకమైన ధర ఇస్తామంటూ రాయబేరాలు
- కేంద్రాల్లో ఊపందుకున్న బర్లీ పొగాకు కొనుగోళ్లు
- మరో 12 కేంద్రాలను తెరిచేందుకు మార్క్‌ఫెడ్ సన్నాహాలు

పొగాకు రైతులకు డబుల్ ధమాకా

(బాపట్ల, పర్చూరు--ఆంధ్రజ్యోతి)

ఆశించిన మేర దిగుబడులు వచ్చినా.. ధర లేక కొన్నాళ్లు.. కొనుగోలు చేసేవారు లేక మరికొన్నాళ్లు ఆందోళన చెందిన బర్లీ పొగాకు రైతులు పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోళ్లు చేపట్టడంతో పొగాకు కంపెనీలు కూడా కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నాయి. దీంతో బర్లీ రైతులకు డబుల్ ధమాకా లబ్ధి చేకూరుతోంది. ఇటీవల వరకు కొనుగోలు చేసే వారు లేక కొందరైతే అప్పులు పాలై ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. మళ్లీ పొగాకు సాగుచేయం ఎలాగోలా కొనుగోలు చేయండని రైతులు కన్నీటి పర్యంతమైనా కంపెనీలు స్పందించలేదు. బర్లీ రైతుల నుంచి కొనుగోళ్లు చేయాలని పొగాకు కంపెనీలను ప్రభుత్వం ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు ప్రభుత్వమే దేశంలో ఎక్కడా ఇప్పటి వరకు జరగనట్లుగా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి బర్లీ పొగాకు కొనుగోళ్లు చేపట్టింది. అంతేగాక ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించి కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంది. కొనుగోళ్ల చేపట్టాలని పదేపదే కంపెనీలకు ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులు నిన్న వరకు పట్టించుకోని కంపెనీలు ఇప్పుడు రైతుల వద్దకు

(మిగతా 8వ పేజీలో)



కొనుగోలు కేంద్రంలో పొగాకు తేమ శాతం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, కలెక్టర్ వెంకటమురళి (పాతచిత్రం)

ఇంటింటికి మంచి ప్రభుత్వం

2 నుంచి టీడీపీ శ్రేణుల సమాయత్తం

- ఏడాది అభివృద్ధి.. సంక్షేమంపై వినూత్న ప్రచారం
- వార్డు, గ్రామ స్థాయిలో చేసిన పనులపై కరపత్రాలు
- దిశానిర్దేశం చేసిన టీడీపీ అధినేత.. ముఖ్యమంత్రి చంద్రబాబు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. ఈ ఏడాదిలో సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. ఈ ఏడాదిలో జరిగిన మంచి గురించి ప్రజలను నేరుగా కలిసి వివరించేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు 'మంచి ప్రభుత్వం' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేతలు, ప్రజాప్రతినిదులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాల గురించి వివరించాలని అధినేత దిశానిర్దేశం చేశారు. దీంతో బుధవారం నుంచి గ్రామ, వార్డు స్థాయిలో ఇంటింటికి టీడీపీ శ్రేణులు వెళ్లనున్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ సాగించిన అరాచక పాలనను ప్రజలకు పార్టీ శ్రేణులు వివరిస్తాయి. ఈ ఏడాదిలో అన్నక్యాంటీన్లు, పించన్ పెంపు, కుటుంబంలో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాల అమలు ప్రజలకు వివరిస్తారు. అరాచక వైసీపీ పాలన.. కూటమి సుపరిపాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని చంద్రబాబు నేతలను ఆదేశించారు. వైసీపీ పాలనలో ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేదని, ఇప్పుడు ప్రతీఒక్కరూ వారి అభిప్రాయలను తెలియజేసే వాతావరణం కూటమి ప్రభుత్వం కల్పించిందని ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పనున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. వీరితో పాటు మార్కెట్ యార్డుల పాలకవర్గాలు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, వార్డు కౌన్సిలర్లు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను నేతలు సిద్ధం చేశారు. కార్యక్రమం అమలుపై ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆదివారం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ప్రగతితో పాటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏడాదిలో చేపట్టిన పనులు, ప్రతి ఇంటికి అందిన సంక్షేమాన్ని తెలియజేసేలా రూపొందించిన రెండు రకాల కరపత్రాలను ప్రజలకు అందజేయనున్నారు. అదేవిధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నమోదు చేసుకుని పరిష్కరించే దిశగా సమాయత్తమవుతున్నారు. దాదాపు నెల రోజులు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో ఈ కార్యక్రమంతో ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకం కానున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పిద్దాం

- ప్రభుత్వ విద్యారంగం బలోపేతంతోనే నైతిక విలువలు
- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

బాపట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పిలుపిచ్చారు. బాపట్లలోని జిల్లా ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిఈడు పిల్లలందర్నీ పాఠశాలలో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. సమాజంలో నైతిక, రాజ్యాంగ విలువలు కాపాడాలంటే ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అన్నిరకాల సదుపాయాలు, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ బడి అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వ బడిపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జూలై మొదటి వారంలో ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక క్యాంపెయిన్ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్, జిల్లాప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగ వికాసం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యూటీఎఫ్ పనిచేస్తుందన్నారు. ఊరిబడిలో పిల్లల్ని చేర్పిద్దాం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పాపారావు, ఉపాధ్యక్షులు బిక్షాలుబాబు, హరిప్రియ, కోశాధికారి ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై.. విచారణ


1 వైసీపీ హయాంలో అనర్హులకు మంజూరు
1 సెల్ఫ్ డిక్లరేషన్‌తో ఆమోదం.. ప్రభుత్వానికి ఫిర్యాదులు
1 రంగంలోకి అధికారులు.. బెంబేలెత్తుతున్న లబ్ధిదారులు

అద్దంకి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల సిఫార్సులు.. సెల్ఫ్ డిక్లరేషన్లతో గత ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున సామాజిక పింఛన్ల మంజూరుపై అధికారులు విచారణ చేపట్టారు. దీంతో బోగస్ పింఛన్ పొందుతున్న వారితో పాటు నాడు సిఫార్సు చేసిన వైసీపీ నేతల్లో వణుకు మొదలైంది. ప్రధానంగా దివ్యాంగులు, చర్మకారులు, డప్పు కళాకారుల కోటాలో అనేక మంది అనర్హులు పింఛన్ల లబ్ధి పొందారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలో 41,304 మంది సామాజిక పింఛన్‌దారులు ఉండగా, వీరిలో 661 మంది డప్పు కళాకారులు, 3835 మంది దివ్యాంగులు, 1078 మంది చర్మకారులు పింఛన్లు అందుకుంటున్నారు. అయితే డప్పు కళాకారులు, చర్మకారుల కులవృత్తుల కుటుంబాలు అత్యల్పంగానే ఉన్నాయి. అయితే అప్పట్లో వైసీపీ నేతల సిఫార్సులతో పెద్దసంఖ్యలో చర్మకారుల పేరుతో పింఛన్లు మంజూరు చేశారు. కొన్ని గ్రామాల్లోనే డప్పు కళాకారులు ఉన్నా ప్రతి గ్రామంలో ఉన్నట్లుగా పింఛన్లు మంజూరు చేశారు. కనీసం డప్పు పట్టుకునేందుకు చేతకాని వాళ్ళు కూడా ప్రస్తుతం పింఛన్ పొందుతున్న వారిలో ఉన్నారు. ఫొటోలు మార్ఫింగ్ చేసి సెల్ఫ్ డిక్లరేషన్‌తో పింఛన్లు మంజూరు చేశారు. డప్పు కళాకారులు, చర్మకారుల పింఛన్ పొందుతున్న వారిని చూసిన ఆయా గ్రామాల ప్రజలు నివ్వెరపోతున్నారు. వైకల్యం లేకున్నా దివ్యాంగుల సర్టిఫికెట్లు పొంది పింఛన్ లబ్ధి పొందుతున్న వారు అనేక మంది ఉన్నారు. ఇలా వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ సానుభూతిపరులు ఇష్టానుసారం సామాజిక పింఛన్లు పొందారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా గ్రామాల్లో బోగస్ పత్రాలతో పింఛన్ పొందుతున్న వారి వివరాలతో జిల్లా, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణకు రంగంలోకి దిగారు. చర్మకారులు, డప్పుకళాకారులను విచారణకు రాకుండా పలువురు డుమ్మా కొడుతున్నారు. దీనిని బట్టి విచారణకు రాకుండా తప్పించుకుంటున్న వారిలో ఎక్కువ మంది అనర్హులే అన్న భావన వ్యక్తమవుతోంది.



ఉప్పుమాగులూరులో విచారణ చేస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి(ఫైల్ ఫొటో)

డంపింగ్‌యార్డులో మంటలు



బాపట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డంపింగ్‌యార్డులో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు ఎగసి పడ్డాయి. పట్టణంలో సేకరించిన చెత్త, వ్యర్థాలు డంపింగ్‌యార్డులో పెద్దఎత్తున నిల్వచేశారు. వ్యర్థాలు వేరు చేసేందుకు యంత్రాలు ఏర్పాటు చేశారు. యంత్రాల చుట్టూ ఉన్న వ్యర్థాల నుంచి మంటలు ఎగసి పడ్డాయి. దీనికి గాలులు కూడా తోడయ్యాయి. ఆ ప్రాంతమంతా పొగ కమ్ముకుంది. డంపింగ్‌యార్డు సమీపంలోని రామకృష్ణాపురం, బేతనీకాలనీ, క్రిస్టియన్‌పేట, రాజీవ్‌గాంధీకాలనీ ప్రాంతాల్లో ఎక్కువగా పూరిళ్లు ఉన్నాయి. మంటల వల్ల ప్రమాదం ముంచుకు వస్తుందేమోనని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంఘటన గురించి తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందితో కలిసి వెళ్ళి యంత్రాలను బయటకు తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. గాలులు విపరీతంగా ఉండటంతో మంటలు అదుపులోకి రాలేదు.

ఒకరు మృతి.. మరొకరు గల్లంతు

u ఓ యువకుడ్ని కాపాడిన గజ ఈతగాళ్లు u తీరంలో ఒకే రోజు రెండు ఘటనలు



సయ్యద్ అబ్దుల్‌బారీ (ఫైల్‌ఫొటో)

చీరాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తీరం వెంబడి ఆదివారం రెండు వేర్వేరు ఘటనల్లో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్‌బారీ(23) అనే యువకుడు మృతి చెందగా, స్థానిక వైకుంఠపురానికి చెందిన ఎడితి భానుచందర్(19) అనే యువకుడు గల్లంతయ్యాడు. ఓ యువకుడు సముద్రంలో కొట్టుకుపోతుండగా పోలీసులు రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నవా బ్‌సాబ్ కుంటకు చెందిన అబ్దుల్ ఆరుగురు మిత్రులతో కలిసి ఆదివారం రామాపురం తీరంలో సరదాగా గడిపేందుకు వచ్చారు. కఠారిపాలెం సమీపంలో తీరంలో మునిగేందుకు సముద్రంలోకి దిగారు. ఈతపై అవగాహన ఉందంటూ లోతుకు వెళ్లిన అబ్దుల్ అలల తాకిడికి కొట్టుకుపోయాడు. మిత్రులు ఆందోళన చెందుతున్న సమయంలో 10 నిమిషాల్లోనే విగతజీవిగా ఒడ్డుకు చేరాడు. వేటపాలెం పోలీసులు కేసునమోదు చేసుకుని మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు.

వాడరేవులో..

స్థానిక వైకుంఠపురానికి చెందిన భానుచందర్ మిత్రుడు సాయితో కలిసి ఆదివారం మధ్యాహ్నం వాడరేవు సముద్ర తీరంలో మునుగుతున్నాడు. అలల తాకిడికి ఇద్దరూ కొట్టుకు పోయారు. గమనించిన మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు సాయిని రక్షించారు. అయితే భానుచందర్ ఆచూకీ తెలియరాలేదు. ఈపూరుపాలెం ఎస్‌ఐ చంద్రశేఖర్ డ్రోన్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీరం వద్దకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.



భాను (ఫైల్‌ఫొటో)



భాను జాడకోసం డ్రోన్ సాయంతో పరిశీలిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

న్యూ పిడుగురాళ్ల రైల్వేస్టేషన్



రైళ్లను ఆపి.. దోపిడీ

- న్యూ పిడుగురాళ్ల స్టేషన్ సమీపంలో దొంగల హల్‌చల్
- బోగీల్లోకి చొరబడి.. ప్రయాణికుల నుంచి బంగారం అపహరణ
- సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్.. ఈ వారంలో మూడు ఘటనలు

పిడుగురాళ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధా న్యం ఇస్తున్నామన్న రైల్వే అధికారుల ప్రకటనలు డొల్లని గుంటూరు డివిజన్ పరిధిలో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు తెలియజేస్తున్నాయి. ఈ వారంలో పిడుగురాళ్ల సెక్షన్‌లో మూడు ఘటనలు చోటుచేసుకున్నాయి. అర్ధరాత్రి వేళల్లో ఈ మార్గంలో రైళ్లను నిలిపేసి దొంగలు బోగీల్లోకి ప్రవేశించి ప్రయాణికులను బెదిరించి బంగారు నగలను దోచుకుంటున్నారు. న్యూ పిడుగురాళ్ల - తుమ్మలచెరువు మధ్య అర్ధరాత్రి తర్వాత ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. నడికూడి - న్యూపిడుగురాళ్ల రైల్వేస్టేషన్లకు జిల్లా కేంద్రం నుంచి దూరం ఎక్కువగా ఉండటం, ఘటన ఏదైనా జరిగితే అదనపు బలగాలు వచ్చేందుకు సమయం పడుతుండటంతో ఈ ప్రాంతంలోనే ఎక్కువగా దొంగలు దోపిడీలకు పాల్పడుతున్నారని సమాచారం. శనివారం తెల్లవారుజామున విశాఖపట్నం నుంచి చర్లపల్లి వెళ్లే ప్రత్యేక రైలును న్యూపిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఆపేశారు. దీంతో 4.15 నుంచి 5.30 గంటల వరకు రైలు నిలిచిపోగా అప్పటికే అక్కడ కాచుకుని ఉన్న దుండగులు బోగీలోకి ప్రవేశించి ఇద్దరు మహిళల మెడల్లోని 50 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించారు. అదేవిధంగా ఆదివారం తెల్లవారుజామున భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు 3.30 గంటల సమయంలో తుమ్మలచెరువు రైల్వేస్టేషన్ చేరుకునే సమయంలో నిలిచిపోయింది. అప్పటికే రైలులో ప్రయాణిస్తున్న దుండగులు ఎస్-1 బోగీలో ప్రవేశించి మహిళలను బెదిరించారు. వారు కేకలు వేయడంతో పక్క బోగీలోని తెనాలి రైల్వే ఎస్‌ఐ వెంకటాద్రి, కానిస్టేబుళ్లు శేషయ్య, సురేంద్రలు చేరుకున్నారు. దుండగులను గుర్తించిన ఎస్‌ఐ గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరపడంతో వారు అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారివైపు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న రైల్వే డీఎస్పీలు

(మిగతా 8వ పేజీలో)

అవీ..ఇవీ..

రాయితీతో అదనపులోడ్ క్రమబద్ధీకరణ

● చెల్లింపులకు నేటితో ముగియనున్న గడువు

చీరాల, మే 29 (ఆంధ్రజ్యోతి) : గృహ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ శాఖ చక్కటి అవకాశం కల్పించింది. గృహవిద్యుత్ వినియోగదారులకు డెవలప్‌మెంట్ చార్జీల చెల్లింపులతో అదనపులోడ్ ఛార్జీలను క్రమబద్ధీ కరిస్తోంది. అందుకు సంబంధించి ఇచ్చిన గడవు సోమవారంతో ముగుస్తుం డటంతో అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ఇప్పటికే సుమారు 2 వేలకు పైగా వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకున్నారు. పూర్తి వివరాలకు అందుబాటులోని కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

పెరిగిన కూరగాయల ధరలు



అన్నగారి సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

అద్దంకి, జూన్29 (ఆంధ్రజ్యోతి): గత నెలరోజులుగా వర్షాలు పడుతున్నా కూరగాయల ధరలు మాత్రం మండుతునే ఉన్నాయి. అద్దంకి మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించే అన్నగారి సంతలో కూరగాయల ధరలు పరిశీలిస్తే గత వారం కంటే ఈ వారం సరాసరి కిలో రూ.10 నుంచి రూ.20 మేర పెరిగాయి. క్యారెట్ కిలో రూ.50, బీరకాయలు రూ.60, టమోటా రూ.40, బెండకాయలు రూ.60, వంకాయలు రూ.40, దోసకాయలు రూ.30 , పచ్చిమిర్చి రూ.30, మునగకాయలు రూ.160గా ఉన్నాయి. ఇక మిగిలిన కూరగాయల ధరలు కూడా ఒకింత ఎక్కువగానే ఉన్నాయి.

ఆదర్శప్రాయుడు ఉపాధ్యాయుడు కేశవరావు

అద్దంకిటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అదనపు సమయాన్ని కేటాయించి విద్యార్థులను పోటీ పరీక్షలలో రాణించేలా ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు కేశవరావు అందరికి ఆదర్శప్రాయుడని ఏఎంసీ మాజీ ఛైర్మన్ నాగినేని రామకృష్ణ అన్నారు. ఆదివారం ధేనువకొండ పునరావాలసకాలనీ బలరామకృష్ణపురం లోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయుడు చప్పిడి కేశవరావును గ్రామస్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటి ఛైర్మన్ గోసాల చెన్నమ్మ, ఉపాధ్యాయులు కట్టా సుబ్బారావు, ఏ.నిర్మాలజ్యోతి, అనపర్తి రత్నకుమార్, మన్నం వెంకట సుబ్బారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అద్దంకి మేజర్ కాలువలో మరమ్మతులు



అద్దంకి మేజర్ కాలువలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి,జూన్29(ఆంధ్రజ్యోతి): అద్దంకి మేజర్ కాలువతో పాటు పలు మైనర్ కాలువలలో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. అద్దంకి మేజర్ లో 16వ కిలోమీటరు వద్ద నుంచి 19వ కి.మీ వరకు 3 కి.మీ దూరంతో పాటు ఆ పరిధిలో ఉన్న మైనర్ కాలువలలో సుమారు రూ.7 లక్షలతో జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులను ఎక్స్‌కవేటర్‌తో చేపట్టారు. దీంతో చిల్లచెట్లతో నిండి ఉన్న కాలువలు శుభ్రం అవుతున్నాయి.

గోశాలకు పశుగ్రాసం అందజేత



పశుగ్రాసం అందజేస్తున్న హైందవశక్తి యువకులు

అద్దంకి, జూన్29 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ వద్ద ఉన్న హరిహర గోకులం గోశాలకు ఆదివారం ముండ్లమూరు మండలం పూరిమెట్లకు చెందిన హైందవశక్తి యువకులు పచ్చిగడ్డిని అందజేశారు. యువకులు ట్రాక్టర్లలో పచ్చిగడ్డిని తీసుకు వచ్చి అందజేశారు. ప్రతి రెండు రోజులకొకసారి పచ్చిగడ్డి అందజేయనున్నట్లు తెలిపారు. గోపాలపురం గ్రామస్థులు కూడా పశు గ్రాసం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో గోశాల నిర్వహకుడు గోనుగుంట సుబ్బారావు, వాసు గురుస్వామి, మన్నం త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, జూన్29(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో కేఎస్‌బీ ఫ్యామిలీ రెస్టారెంట్ ను మంత్రి రవికుమార్ ప్రారంభించనున్నారు. అనంతరం పంగులూరు లోని మార్కెట్‌యార్డు, ఇంకొల్లు, పర్చూరులలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులతో కలిసి ప్రారంభించనున్నారు.

మళ్లీ వినియోగంలోకి ..

● ధర్మవరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు అభివృద్ధికి నిధులు ● 12 గ్రామాలకు తీరనున్న తాగునీటి కష్టాలు



చిల్లచెట్లతో నిండి ఉన్న ధర్మవరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

అద్దంకి,జూన్29 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అధికారుల చిన్నపాటి అవగాహన లోపం రెండు దశాబ్దాలు పాటు 12 గ్రామాలకు మంచినీటి సరఫరా లేకుండా పోయింది. ఆ లోపాన్ని సరిచేసేందుకు రెండు దశాబ్దాల తరువాత సుమారు రూ.7 కోట్లతో పనులు ప్రారంభించనున్నారు. రెండు దశాబ్దాలుగా మూలన పడి నిరుపయోగంగా ఉన్న 12 గ్రామాలకు మంచినీటి సరఫరా చేసే ధర్మవరం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌కు ఎట్టకేలకు మోక్షం కలగనుంది.

అద్దంకి మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు, కలవకూరు, శింగరకొండపాలెం, గోపాలపురం, చక్రాయలెం, శాంతినగర్, శ్రీనివాసనగర్, సాధునగర్, చినకొత్తపల్లి, గోవాడ, కొత్తరెడ్డిపాలెం గ్రామాలకు మంచినీటి సరఫరాకు రెండు దశాబ్దాల క్రితం ధర్మవరం పెద్దచెరువులో కొంతభాగాన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చారు. అయితే అద్దంకి మేజర్ కాలువ నుంచి ధర్మవరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు పం పింగ్ చేసే మోటార్ల సామ ర్థ్యం తక్కువగా ఏర్పాటు చేశా రు. అప్పట్లో అద్దంకి మేజర్‌కు 6 నెలల పాటు నీటి సరఫరా జరుగుతుందనే అంచనాతో పంపింగ్ మోటార్లు ఏర్పాటు చేశారు. దీనికి తోడు సమ్మర్ ట్యాంక్‌లో అడుగు భాగంలో నింపిన మట్టి మంచిది కాకపోవ డంతో పంపింగ్ చేసిన నీళ్లన్నీ ఇంకిపోతున్నాయి. దీంతో ట్రయల్ రన్ సమయంలోనే ఈ ప్రాజెక్టు అట కెక్కింది. పలుమార్లు మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయిం ది. దీంతో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ వద్ద ఏర్పాటు





నిరుపయోగంగా మారిన ఫిల్టర్‌లు, ఓవర్ హెడ్ ట్యాంక్, శింగరకొండపాలెంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ కింద కట్టివేసి ఉన్న గేదెలు

ఫిల్టర్లు, మోటార్‌లు, ఆయా గ్రామాలకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లు, ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు పూర్తిగా శిథిలా వస్థకు చేరాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టిసారించి నిరుపయోగంగా ఉన్న ధర్మవరం మంచినీటి పథకాన్ని వినియోగంలోకి వచ్చే విధంగా సుమారు రూ.7 కోట్లు మంజూరు చేయించారు. టెండర్లు పూర్తయ్యా యని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు తెలిపారు. ప్రస్తుతం ఆయా గ్రామాలలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు పైప్‌లైన్లు వేస్తున్నందున ధర్మవరం సమ్మర్‌ట్యాంక్ పనులు కూడా పూర్తయితే 12 గ్రామాలకు మంచినీటి సరఫరాకు వీలు కలుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పారదర్శక సేవలతోనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ

జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం



వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న డీఈవో పురుషోత్తం

చీరాల, మే 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పారదర్శక సేవలు అందిస్తేనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ సాధ్యమని డీఈవో పురుషోత్తం అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం చీరాల పట్టణ శాఖ 20వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక రోటరీ కమ్యూనిటీ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా డీఈవో, మాజీ శాసన మండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అతిథులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారంలో కచ్చితంగా ముందుకు సాగుతా మన్నారు. విద్యాలయాల అభ్యు న్నతికి పాటుపడతామని చెప్పారు. అలాగే ఉపాధ్యా యులు కృషీ పట్టుదల విడువక సేవలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, అమర్నాథ్, శ్రీనివాస్, ఎర్రయ్య, ప్రభాకరరావు, ఏసురత్నం, వెంకటేశ్వర్లు, శ్రీదేవి, పార్వతి, అపర్ణ, రమేష్, సుబ్బారెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం



పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

పంగులూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరులో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాట్లను తహసీల్దార్ సింగారావు, ఏవో సుబ్బారెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావులు ప్రారంభించనున్నారు. పంగులూరు మార్కెట్ యార్డులో అవసరమైన ఏర్పాట్లు చేశారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జనకవరం పీఏసీఎస్ పర్యవేక్షణలో పొగాకు కొనుగోళ్లు చేపట్టనున్నారు. అధికారులు వెంట టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీని వెనుక నుంచి ఢీకొన్న మరోలారీ

డ్రైవర్, క్లీనర్లకు గాయాలు



దెబ్బతిన్న లారీ క్యాబిన్

అద్దంకి ,జూన్ 29(ఆంధ్ర జ్యోతి): మండలంలోని చక్రాయపాలెం వద్ద నామ్ రోడ్డులో ముందు వెళ్తున్న లారీని వెనుక వచ్చే లారీ ఢీకొట్టింది. దీంతో డ్రైవర్, క్లీనర్లకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత పిడుగురాళ్ల వైపు నుంచి మేదరమెట్ల వైపు వెళ్తున్న లారీని చక్రాయపాలెం వద్ద వెనుక నుంచి వచ్చే లారీ ఢీ కొట్టింది. దీంతో వెనుక లారీ డ్రైవర్ శ్రీను, క్లీనర్ లక్ష్మీనారాయణలకు గాయాలయ్యాయి.



గాయపడ్డ డ్రైవర్ శ్రీను

క్షతగాత్రులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. లారీ క్యాబిన్ పూర్తిగా దెబ్బతింది.

సీఎంతో సమావేశానికి ఎమ్మెల్యే హాజరు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం మంగళగిరిలో ఆదివారం జరిగిన 'సుపరిపాలన తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ' సమావేశంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్యక్షతన దిశానిర్దేశ కార్యక్రమం నిర్వహించారు. మంత్రులు కొలుసు పార్థసారధి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, సహచర శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డితో కలసి ఏలూరి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో సుపరిపాలనలో తొలి అడుగు పుస్తకాన్ని ఆయన తిలకించారు.

బర్లీకి.. బొనంజా

(5వ పేజీ తరువాయి)

ప్రతినిధులను పంపి రాయబేరాలు చేస్తున్నాయి. కొనుగోళ్లు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే.. అంతర్జాతీయ మార్కెట్ లెక్కలను వల్లెవేయడంతో పాటు ఇష్టం వచ్చినట్లు సాగు చేశారన్న తప్పును రైతులపై కంపెనీలు వేశాయి. చివరకు ప్రభుత్వం ఈ నెల 19 నుంచి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టింది. బాపట్ల జిల్లాతో పాటు గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగగానే పొగాకు కంపెనీలు ధరపై స్వరం మార్చాయి. తాము కూడా అదే ధరకు కొనుగోలు చేస్తామంటూ ముందుకు వచ్చాయి. బర్లీకి డిమాండే లేదని నిన్నమొన్నటి వరకు చెబుతూ వచ్చిన కంపెనీలు ఇప్పుడు మాటమార్చడం గమనార్హం. ఓ వైపు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న తరుణంలో కారణాలు ఏవైనా కానీ కంపెనీలలో కూడా కదలిక రావడాన్ని బర్లీ రైతులతో పాటు ప్రభుత్వం కూడా స్వాగతిస్తోంది.

3,100 క్వింటాళ్లు కొన్న మార్క్‌ఫెడ్..

బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ తెరిచిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు ఆయా కేంద్రాల నుంచి 3,100 క్వింటాళ్ల వరకు పొగాకు సేకరించింది. ఈ క్రాప్‌లో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాటన్నింటిని తొలగించడానికి కసరత్తు చేసిన యంత్రాంగం వాటిని ఓ కొలిక్కి తెచ్చి దాదాపు 13,000 ఎకరాల్లో పొగాకును అదనంగా కొనేందుకు మార్గం సుగమం చేసింది. ఇప్పటికే నాలుగు జిల్లాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలు నడుస్తుండగా మరో 12 కేంద్రాలను అదనంగా తెరవడానికి మార్క్‌ఫెడ్ సన్నాహాలు చేస్తోంది. ఈ పరిణామాలతో కంపెనీలు కూడా పెద్దఎత్తున పొగాకు కొనుగోలు చేపట్టినట్లు సమాచారం. పైగా గ్రేడ్లతో సంబంధం లేకుండా సగటున రూ.8,000 నుంచి రూ.9,000 వరకు క్వింటాకు ధర ఇవ్వడానికి కొన్ని కంపెనీలు ముందుకు రావడం గమనించదగ్గ అంశం. బర్లీ పొగాకు సాగులో నెలకొన్న పరిణామాలతో క్రాప్ హాలిడే ప్రకటించింది. పైగా ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయశాఖ ద్వారా రైతులను ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది పొగకు పంట ఉండదన్న సంకేతాలతో కంపెనీలను పునరాలోచనలో పడ్డాయని దీంతోనే కొనుగోళ్లకు రంగంలోకి దిగాయని తెలుస్తోంది.

ప్రభుత్వబడుల స్థాయిని పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే



సాంబశివరావు దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో

మార్టూరు, జూన్29 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులలో విద్యాస్థాయిని పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని ఎంఈవో వస్రాంనాయక్ అన్నారు. మండలంలోని కోనంకి గ్రామంలోని ఏయూపీ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయులు లక్కరాజు సాంబశివరావు సోమవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం పాఠశాలలో సాంబశివరావు సన్మానసభను ఏర్పాటు చేశారు. ఈ సభకు లక్కరాజు శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ఎంఈవో వస్రాంనాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోందన్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను, ఉన్నతమైన విలువైన విద్యను అందించాల్సి బాధ్యత ఉపాధ్యాయులదన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శకునిలాగా వ్యవహరించాలన్నారు. అనంతరం సాంబశివరావు, గాయత్రిదేవి దంపతులను సహచర ఉపాధ్యాయులు, ఎంఈవో వస్రాంనాయక్‌లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో యం పిచ్చయ్యశర్మ, మాజీ ఎంపీపీ ఉప్పలపాటి చెంగలయ్య, ఉప్పలపాటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయురాలు ఉప్పలపాటి లక్ష్మి, కోటపాటి కోమలి పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మార్టూరు, జూన్29(ఆంధ్రజ్యోతి):మార్టూరు లో ఘట్టేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో అలపర్తి గీత (47) అనే వివాహిత ఇంటిలో సీలింగ్ ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకొంది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు గతంలోనే వివాహం జరిగింది. పెద్దకుమార్తె కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఆమె ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఇంటిలో ఒక్కరే ఉన్నారు. తరువాత ఈ విషయాన్ని గమనించిన భర్త, బంధువులు వెంటనే ఆమెను ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు పరీక్షించిన వైద్యులు తెలిపారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు, జూన్29(ఆంధ్రజ్యోతి): మార్టూరు నుంచి నాగరాజుపల్లి వెళ్లే రోడ్డులో గ్రానైట్ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తంగిరాల అబ్రహం(29) శనివారం అర్ధరాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. బల్లికురవ మండలం చెన్నుపల్లి గ్రామానికి అబ్రహాంకు భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఆయన ఈ నెల 26న సాయంత్రం బావమరిదితో కలిసి ద్విచక్రవాహనంపై మార్టూరు వచ్చి తిరిగి చెన్నుపల్లి వెళుతున్నారు. వారి ద్విచక్రవాహనాన్ని ఐరన్ ఫ్యాక్టరీ మలుపు వద్ద బల్లికురవ వైపు నుంచి వస్తున్న గ్రానైట్ ముడిరాయి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అబ్రహంను 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అ క్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. భార్య రోజా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఎస్ఐ సైదా ఆధ్వర్యంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులు చెన్నుపల్లికి తీసుకువెళ్లారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

నేర నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలి

ఎస్సై షేక్. ఖాదర్ బాషా



గ్రామస్థులను సూచనలిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

కారంచేడు (పర్చూరు), జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నేరనియంత్రలో ప్రజలు భాగస్వాములు కావాలని కారంచేడు ఎస్సై షేక్.ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం కారంచేడు మండలం ఆదిపూడి గ్రామాన్ని సందర్శించి ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏదైన కొద్దిపాటి సమస్య తలెత్తిన సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సోదరబావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

● హాజరుకానున్న రాష్ట్రమంతులు రవికుమార్, పార్థసారథి

పర్చూరు/ఇంకొల్లు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నేడు పర్చూరు నియోజకవర్గంలోని పర్చూరు, ఇంకొల్లు మండలాల్లో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారధి, గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలసి పర్యటించనున్నారు. ఇంకొల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన నల్లబర్లీ కొనుగోలు కేంద్రాన్ని ఉదయం 11.30 మంత్రులు ప్రారంభిస్తారని ఏలూరి క్యాంపు కార్యాలయం ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు పర్చూరు స్టేట్ వేర్‌హౌస్ కార్పోరేషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు తీరును పరిశీలించి, రైతులతో కొంతసేపు ముచ్చటించన్నారు.

2న ఏఎంసీ పాలకవర్గం ప్రమాణస్వీకారం



అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

అద్దంకి, జూన్29 (ఆంధ్రజ్యోతి): అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం జూలై 2న జరగనుంది. గౌరవ ఛైర్మన్‌గా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉంటారు. ఏఎంసీ ఛైర్మన్‌గా వరగాని పద్మావతి, వైస్‌ఛైర్మన్‌గా ధర్మవరపు నాగేశ్వరరావు, సభ్యులుగా చింతా వెంకటేశ్వరరెడ్డి, గుంజి రామాంజనేయులు, గుంజి రేణుక, కర్నాటి పూర్ణచంద్రరావు, కొప్పర్తి నాగరాజ, మద్దుమాల నారయ్య, మేకల అంకమ్మ, పూనాటి పద్మ, రాయపాటి రామాంజమ్మ, షేక్ రహిమూన్‌బీ, బొప్పూడి భారతీ, కురిచేటి వెంకటసుబ్బారావు, మిద్దెబోయిన పాపారావులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. వీరితో పాటు నాగులపాడు పీఏసీఎస్ అధ్యక్షులు, ఏఎంసీ అసిస్టెంట్ డైరెక్టర్, అద్దంకి మున్సిపల్ ఛైర్‌పర్సన్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫసర్లు కూడా సభ్యులుగా ఉంటారు.

రైళ్లను ఆపి.. దోపిడీ

(5వ పేజీ తరువాయి)

అక్కేశ్వరరావు, శైలేష్‌కుమార్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కాల్పులు జరిపేందుకు వెనుకాడం

రైళ్లలో దొంగతనాలకు ప్రయత్నించినా, చేసినా వారిపై కాల్పులు జరిపేందుకు కూడా వెనుకాడమని రైల్వే డీఎస్పీలు అక్కేశ్వరరావు, శైలేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. వారం వ్యవధిలో జరిగిన మూడు ఘటనలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. దోపిడీ ముఠాలు బీహార్, మహారాష్ట్రకు చెందినవిగా అనుమానిస్తున్నామన్నారు. సమావేశంలో రైల్వే ఎస్ఐలు హుస్సేన్, అంజిబాబు, మోహన్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం

- బారా షహీద్ దర్గాకు విద్యుత్ దీపాలంకరణలు
- ప్రాంగణంలో చలువ పందిళ్లు
- భారీ యంత్రాలతో గుర్రపుడెక్క తొలగింపు
- నీటి శుద్ధికి చెరువులో బ్లీచింగ్ చల్లకం
- కొత్త పైపులైన్ల ఏర్పాటు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో జూలై 6 నుంచి జరగనున్న రొట్టెల పండుగకు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. బారాషహీద్ దర్గాను, పరిసరప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దర్గా ప్రాంగణంలో చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. స్వర్ణాల ఘాట్‌ను శుభ్రం చేయిస్తున్నారు. దర్గాను సందర్శించేందుకు ఇప్పటి నుంచి పలు రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఈసారి రొట్టెల పండుగకు గతంలో కంటే పెద్దసంఖ్యలో భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. పండుగకు ముందు గానే ఏర్పాట్లు పూర్తిచేయాలని మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో నగర పాలక సంస్థ అధికారులు పనులు ముమ్మరం చేశారు. స్వర్ణాల చెరువులో ఘాట్, బోట్‌క్లబ్‌ల వద్ద ఉన్న గుర్రపుడెక్క తొలగించేందుకు ఆదివారం భారీ యంత్రాలను రంగంలోకి దించారు. స్వర్ణాల చెరువులో దీర్ఘకాలంగా చెత్తాచెదారం నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తున్నది. భక్తుల, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువు నీటిశుద్ధికి అధికారులు ఆలం, బ్లీచింగ్‌ను బస్తాలలో నింపి పడవల సాయంతో చెరువులో వదులుతున్నారు. భక్తులకు నీటివసతి కల్పించేందుకు పైపులైన్ల పనులను చేపట్టారు. జూలై 2 నాటికి మౌలిక వసతులను పూర్తి చేయాలని అధికారులు, సిబ్బంది విరామం లేకుండా పనులు చేస్తున్నారు.


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న జనసేన నాయకులు


విద్యుత్ దీపాలంకరణలో బారా షహీద్ దర్గా


దర్గాలో ప్రాంగణలో వేసిన పందిళ్లు


పడవపై తిరుగుతూ నీటిశుద్ధికి బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

● పవన్‌కు ఆహ్వానం

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్‌ను రొట్టెల పండుగకు రావాలని ఆహ్వానించామని, ఆయన వచ్చే అవకాశాలు ఉన్నాయని జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు తెలిపారు.

బారా షాహీద్ దర్గా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలిం చారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చప్పిడి శ్రీనివాసులురెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ కోలా విజయలక్ష్మి, నాగరత్నం, తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాల చెరువులో గుర్రపుడెక్క తొలగిస్తున్న యంత్రం, పైపులైన్లు నిర్మాణ పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు


ఆలయం ఎదుట సుడిమానును ప్రతిష్ఠిస్తున్న భక్తులు

కలిగిరమ్మ తిరుణాళ్ల ప్రారంభం

కలిగిరి, జూన్29(ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు జిర్రావారిపాలెం, పాపనముసిలిపాలెం గ్రామాల గ్రామదేవత అయిన కలిగిరమ్మ తిరు ణాళ్ల ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. మొదటిరోజు ఆలయం ఎదుట సుడిమాను ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఐదు రోజులపాటు ఈ తిరుణాళ్ల జరగనున్నాయి.

భూసేకరణపై నిరసన గళం

- ఇండోసోల్ కంపెనీ వ్యవహారంపై హైవే దిగ్బంధం ● వేలాదిమంది రైతుల ఆందోళన
- ముందుండి నడిపిన మహిళలు ● నిలువరించలేక పోయిన పోలీసులు
- ఉన్నతాధికారులతో మాట్లాడి, భూసేకరణ నిలిపేయిస్తా.. ● సబ్ కలెక్టర్ హామీతో శాంతించిన అన్నదాతలు

ఉలవపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీ నిర్మాణం కోసం తలపెట్టిన భూసేకరణ నిలిపివేయాలని కరేడు గ్రామస్థులు, పార్టీలకు అతీతంగా ఆదివారం జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. పోలీసులకు గ్రామస్థులకు వాగ్వాదం జరిగి ఉద్రిక్తత నెలకొన్నా, అనుకున్న ప్రకారం కరేడు ర్యాంపు వద్ద హైవేపై అరగంటపాటు వారు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు, రైతులు సుమారు నాలుగువేలమంది ఒక్కసారిగా రోడ్డెక్కారు. 300 మంది పోలీసులు ఆదివారం తెల్లవారుజాము నుంచి కరేడు నుంచి వచ్చే దారులన్నింటిని దిగ్బంధం చేసినా ఆందోళనకారులను అడ్డుకోలేకపోయారు.

● మహిళల నాయకత్వం

కరేడు పంచాయతీ పరిధిలోని 16 గ్రామాల్లోని మహిళలు పెద్దఎత్తున పాల్గొని, ఆందోళనను ముందుండి నడిపించారు. రామకృష్ణాపురం చిల్లకాలువ బ్రిడ్జిపై బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయినా వారిని నిలువరించలేక పోయారు.

● రైతులకు మద్దతుగా రామచంద్రయాదవ్

భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ కరేడు రైతులకు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. కాగా కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ ఆందోళన చేస్తున్న గ్రామస్థులు, రామచంద్రయాదవ్‌తో సంప్రదింపులు జరిపారు. ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని, హైవేపై నిరసన విరమించుకోవాలని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా నిరసనకారులు పోలీసు బలగాలను తోసుకుంటూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదం జరిగి, ఉద్రిక్తత నెలకొంది.

● భూసేకరణ నిలిపివేయిస్తా...

హైవే దిగ్బంధంలో రెండు వైపులా కిలో మీటరుకుపైగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ శ్రీపూజ ఆందోళన కారులతో మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి తాత్కాలికంగా భూసేకరణ జరగ కుండా చూసే బాధ్యతను తాను తీసుకుంటా నని, హామీ ఇవ్వడంతో రైతులు, గ్రామస్థులు ఆందోళన విరమించారు.

● పోలీసుల సంయమనం

కాగా శనివారం సాయంత్రం కరేడు గ్రామానికి డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సిబ్బం దితో వెళ్లి హైవేపై నిరసన చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినా, ఆదివారం నిరసనకారులు తరలివచ్చారు. ఆందోళనకారులు కవ్వింపు చర్యలకు పాల్పడినా పోలీసులు సంయమనం పాటించారు. దీంతో పరిస్థితి చేయి దాటిపోలేదు.


● పలువురు నేతల అరెస్టు

కందుకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హైవే నిర్బంధంలో పాల్గొన్న పలు రాజకీయ పార్టీ నేతలను పోలీ సులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వర రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సుంకర పద్మశ్రీ, మాజీ ప్రొఫెసర్ వసుంధర, సీపీఎం నాయకులు జీ వెంకటే శ్వర్లు, మాల్యాద్రి, కుమార్ తదితరులు ఉన్నారు.

● ఎమ్మెల్యే బెదిరించారు: మహేశ్వరరావు

రైతుల ఆందోళనకు మద్దతుగా ఆమ్ ఆద్మీ పార్టీ నిలుస్తుందనే ఆక్రోశంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం రాత్రి ఫోన్ చేసి భయ పెట్టారని ఆ పార్టీ నియోజక వర్గ కన్వీనర్ నేతి మహేశ్వ రావు ఆది వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదన్నారు.


వివిధ గ్రామాల నుంచి ఆందోళనకు భారీగా తరలివస్తున్న రైతులు


ఉలవపాడు జాతీయ రహదారి కరేడు ర్యాంపు వద్ద హైవేను దిగ్బంధం చేసిన రైతులు, కరేడు గ్రామస్థులు


రామచంద్రయాదవ్, గ్రామస్థులతో మాటాడుతున్న కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ

పచ్చని పొలాల్లో 'ఇండోసోల్ ' మంటలు

- సోలార్ ప్రాజెక్టు కోసం మా బతుకులు బజారు కీడుస్తారా ?
- మండిపడుతున్న కరేడు రైతులు

కందుకూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ పరిశ్రమ కోసం పచ్చని పంట పొలాల్లో మంట పెడతారా ? అని కరేడు గ్రామ రైతులు ఆగ్రహిస్తున్నారు. మాబతుకులను బజారుకు ఈడ్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే, మా ప్రాణాలైన ఇస్తాంకానీ, భూములు ఇచ్చే ప్రసక్తేలేదని వారు స్పష్టం చేస్తున్నారు. కరేడు గ్రామ పరిధిలో ఇండోసోల్ కంపెనీ కోసం 4,855 ఎకరాల భూసేకరణకు ఈనెల 22న కలెక్టర్ ఏకపక్షంగా నోటిఫికేషన్ జారీ చేశారు. దీన్ని నిరసిస్తూ రైతులు ఆదివారం రోడ్డెక్కారు. 17,000లకుపైగా జనాభా కలిగి 16 శివారు గ్రామాలతో కందుకూరు నియోజకవర్గంలోనే అతి పెద్ద గ్రామ పంచాయతీ కరేడు. గ్రామంలో 12,632 ఎకరాల భూములు ఉండగా, అందులో 2,600 ప్రభుత్వ భూమి. 1200 ఎకరాలు అటవీశాఖది. మిగిలిందంతా పట్టా భూమి. కాగా 3,000 ఎకరాలకుపై ఏటా రెండు పంటలు పండే మాగాణి భూమి.400 ఎకరాల్లో మామిడి, సపోట తోటలు ఉండగా 100 ఎకరాలకు పైగా విస్తీరణంలో అరటి తోటలు, టెంకాయ చెట్లు ఉన్నాయి. గ్రామంలో ఎలాంటి ప్రజాభిప్రాయం సేకరణ జరపకుండా కలెక్టర్ భూసేకనణ నోటిఫికేషన్ జారీ చేయడంపై గ్రామప్రజలంతా ఉడికిపోతున్నారు.


కరేడులో సాగులో ఉన్న మామిడి తోటలు



మేమెలా బతకాలి...?

గ్రామంలో ఏళ్ల తరబడి వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నాం. ఏటా మూడు పంటలు పండే మా భూములను సోలార్ పరిశ్రమకోసం తీసుకుంటే మేమేలా బతకాలి. సారవంతమైన భూముల్లో పరిశ్రమ పెట్టాలనుకోవడంలో మర్మమేమిటో తెలపాలి.

- బత్తుల వెంకట రమణారెడ్డి, కరేడు గ్రామ రైతు



రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే..

గ్రామంలో ఎలాంటి సమావేశం పెట్టకుండా, మా బతుకుదెరువుకు ఏమి ప్రత్యామ్నాయం చూపిస్తారో చెప్ప కుండా, భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చారు. భూములకు ఎంత పరిహారం ఇస్తారో కూడా మాకు తెలియదు. రూ. లక్షల విలువ చేసే మా భూములను లాక్కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారు.

- కే రామసుబ్బారెడ్డి, కరేడు గ్రామ రైతు

మహిళా సంరక్షణ కార్యదర్శులకు బదిలీలు

● నేడు పోలీసు కార్యాలయంలో ప్రక్రియ

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు బదిలీల ప్రక్రియ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరగనున్నది. జిల్లా వ్యాప్తంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు 700 మంది వరకు ఉన్నారు. వారిలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసినవారు, ప్రత్యేక కేటగిరి, రిక్వెస్టు బదిలీలు కోరుకునేవారు మొత్తం కలిపి సుమారు 500 మందికి స్థానచలనం కలగనున్నది. పోలీసు కార్యాల యంలో ఉదయం 8 నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మహిళా సంరక్షణ కార్యదర్శులుగా పనిచేస్తూ బదిలీలకు అర్హత కలిగిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు పీహెచ్ సర్టిఫికెట్, వీహెచ్ సర్టిఫికెట్, స్పౌజ్, నో డ్యూస్, మెడికల్ సర్టిఫికెట్లను ఒక సెట్ జెరాక్స్‌తోపాటు ఒరిజనల్స్‌ను తీసుకురావాలని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు

కందుకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు రోడ్డులో గల ప్రశాంతి కాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు బోర్డు పెట్టారు. సర్వే నెంబరు 122 బై 1లో రూ. కోట్ల విలువ చేసే 1.75 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు కొందరు చదును చేశారు. ఈ విషయమై 'ఖాళీ జాగా.. వేస్తాం పాగా' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ లావణ్య ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమిని లేఅవుట్‌గా మార్చి పేదలకు పట్టాలు ఇచ్చేందుకు మున్సిపల్ నిధులతో మూడేళ్ల క్రితం లెవలింగ్ చేశారు. అయితే కొందరు నకిలీ పట్టాలతో కబ్జా చేసేందుకు యత్నించారు. ఐదుగురు వ్యక్తులు ఒక్కొక్కరు పేరుతో 35 సెంట్ల చొప్పున పట్టాలు సృష్టించుకున్నారని, గుర్తించిన రెవెన్యూ అధికారులు అవి చెల్లుబాటు కావని నిర్ధారణకు వచ్చారు. దీంతో అది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేశారు.



ఆక్రమణకు యత్నించిన భూమిలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	228

కోడిగుడ్ల ధర (100): 575

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9200
వెండి కిలో ధర	రూ. 108900
వెండి ఒక గ్రాము	రూ.111.90

లోక్ అదాలత్‌పై అవగాహన పెంచుకోవాలి

అల్లూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌పై అవగాహన పెంచుకోవాలని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కక్షలు, కార్పన్యాలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలని పేర్కొన్నారు. పెండింగ్ కేసులు, సత్వర న్యాయం కోసం ఎదురు చూసే కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకొని సమస్యలు లేని సమాజం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కావలిలో నిర్వహించే లోక్‌అదాలత్‌ను జలదంకి, కలిగిరి, కావలి, బోగోలు ప్రాంత ప్రజలు వినియోగించుకొని సమస్యలు లేకుండా ప్రశాంత వాతావరణంలలో జీవించాలని తెలిపారు.

దళితవాడలో విద్యుత్ కష్టాలు!

● లో ఓల్టేజీతో కాలిపోతున్న గృహోపకరణాలు

కావలిరూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నాయపాలెం దళితవాడ వాసులకు లో ఓల్టేజీ సమస్యతో విద్యుత్ కష్టాలు తప్పడం లేదు. దళితవాడలో సుమారు 80 కుటుంబాలు నివశిస్తున్నాయి. విద్యుత్ సరఫరాలో నిత్యం హెచ్చుతగ్గులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాన్లు, లైట్లు, తదితర గృహోపకరణాలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అనేకమార్లు విద్యుత్ శాఖాధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే ఇంటూరికి రుణపడి ఉంటా !


పూరిమిట్ల గురునాథం

లింగసముద్రం, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని టీడీపీ మండల అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అదిష్ఠానం, ఎమ్మెల్యే తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అందరిని సమన్వయం చేసుకుని మండలంలో గ్రామస్థాయి నుంచి టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ అందుబాటులో ఉంటూ, కార్యకర్తల కోసం నిరంతరం పని చేసి పార్టీ అభివృద్ధికి దోహదపడతానన్నారు.

మరోసారి మండల అధ్యక్షుడిగా జనిగర్ల


జనిగర్ల నాగరాజు

గుడ్లూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : మారుమూల పల్లెలో జన్మించిన జనిగర్ల నాగరాజు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా మరోసారి నియమితులయ్యారు. దీంతో కూటమిలోని జనసేన నాయకులు సనిశెట్టి గిరిబాబు, అనిమిశెట్టి మాధవరావు, కొట్టే పుల్లయ్య, తికనం మారుతీరావు, ఆలా శివా, మెగిలిశెట్టిరాజ, బెదడం మాదవ, జనసేన వీర మహిళ సనిశెట్టి జాహ్నవి ప్రవలిక తదితరులు నాగరాజుకు అభినందనలు తెలిపారు. అలాగే తమ శ్రమను గుర్తించి మద్దతు పలికిన తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులకు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి నాగరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

హనుమంతరావు ఎంపికపై హర్షం

దగదర్తి(బిట్రగుంట), జూన్ 29(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం టీడీపీ అధ్యక్షుడిగా అల్లం హనుమంతరావును అధిష్ఠానం ఎంపిక చేయడంపై టీడీపీ కార్యకర్తలు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన హనుమంతరావును రెండవ సారి ఎన్నుకోవడంతో పాటు మండల ప్రధాన కార్యదర్శిగా ఇంజన్ కొండపనాయుడును ఎంపిక చేశారు. తమపై నమ్మకంతో పార్టీ మండల బాధ్యతలు అప్పగించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అంకమ్మకు పొంగళ్లు

కొండాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడవళ్లూరు పంచాయతీ పెద్దూరులో వెలసి ఉన్న పద్మాలగిరి అంకమ్మ, గుండ్లపల్లి నాగార్పమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామంలో ప్రతి ఆదివారం భక్తులు పొంగళ్ల పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ విధంగా పూజలు చేస్తే తమ కుటుంబాలకు మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.

డంపింగ్ యార్డులుగా
పట్టణ శివారు రోడ్లు!

● పట్టించుకోని మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు


రోడ్డు పక్కన చెత్త, చెదారంతోపాటు కొబ్బరి బొండాలు


పెద్దపవని రోడ్డు పక్కన చెత్తాచెదారం కుప్పలు

కావలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్కడా రోడ్లపై చెత్తా చెదారం కనిపించకూడదని అధికారులు చెపుతున్నారు. అయితే పట్టణంలోకి ప్రవేశించే నాలుగు దిశల రోడ్ల శివారుల్లో రోడ్డ మార్జిన్‌ను మినీ డంపింగ్ యార్డులుగా మారాయి. కుప్పలుగా పోస్తున్న చెత్తా చెదారంతో వాహనదారులు రోడ్డు మార్జిన్ దిగలేని పరిస్థితి నెలకొంది. అయినా సంబంధిత ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణ లు ఉన్నాయి. పట్టణంలోకి ప్రవేశించే కావలి-పెద్దపవని రోడ్డు, కావలి-ఉదయగిరి రోడ్డు, కావలి-తుమ్మలపెంట రోడ్డు, కావలి -ముసునూరు రోడ్డు ఈ నాలుగు రోడ్ల మార్గాల వద్ద చెత్తా చెదారాలను వేస్తున్నారు. అలాగే పెద్దపవని రోడ్డు నుంచి ఉదయగిరి రోడ్డులోకి ప్రవేశించే బైపాస్ రోడ్డులో కూడా చెత్తా చెదారం వేస్తుండటంతో అవి పట్టణంలోకి ప్రవేశించే ప్రజలకు తొలుత స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా కొబ్బరి బొండాల వ్యాపారులు వాడిన బొండాలను తీసుకెళ్లి పట్టణ శివారులలో రోడ్ల వెం బడి వేస్తున్నారు. వర్షం పడితే అవి కాలువలోకి చేరి వర్షపునీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయి. కొంత మంది చిరు వ్యాపారులు తమ దుకాణాల వద్ద ఉన్న చెత్తా చెదారాలను కూడా శివారులలో వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇళ్ల మరమ్మతులు చేసుకునే వారు కూడా వేస్ట్ మెటీరియల్‌ను తీసుకెళ్లి వేస్తున్నారు. దీంతో రోడ్ల వెంబడి అపరిశుభ్రంగా తయా రవుతోంది. విశాలమైన రోడ్లు ఉండి కూడా వాటి వెంబడి చెత్తాచెదారం ఉండటంతో ఆరోడ్లకు ఉన్న లుక్ తగ్గిపోతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్ల వెంబడి చెత్తా చెదారం వేయకుండా తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రోడ్డుకు అతుకులు వేశారు..
వ్యర్థాలను అక్కడే వదిలేశారు!


గాంధీనగర్ కాలనీలో రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలు

కావలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం గాంధీనగర్ మెయిన్ రోడ్డుకు ఇటీవల ప్యాచ్‌వర్క్‌లు వేసి వేస్ట్ మెటీరియల్ రోడ్డుపైనే వదిలేశారు. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్యాచ్‌వర్క్‌లు వేసిన కాంట్రాక్టర్ రోడ్డును పగులకొట్టిన వేస్ట్ మెటీరియల్‌ను అక్కడ నుంచి తరలించాల్సి ఉంది. కానీ ఆయన మట్టిని తొలగించకపోయినా అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై ఉన్న ఆ మట్టి కుప్పలతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలు తొలగింపచేసి ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలగించాల్సి ఉంది.

రోటరీక్లబ్ ద్వారా విస్తృత సేవలు



మాట్లాడుతున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సమావేశానికి హాజరైన రొటేరియన్లు, ప్రజలు

కావలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కావలి రోటరీక్లబ్ ద్వారా విస్తృత సేవలు అందిస్తామని నూతనంగా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఏ.రమేష్‌రెడ్డి తెలిపారు. రోటరీక్లబ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని నారాయణ కల్యాణ మండపంలో రోటరీక్లబ్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రోటరీక్లబ్ ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలను గురించి చర్చించారు. అనంతరం నూతన కమిటీ ఎంపిక జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎంపికైన ఏ.రమేష్ రెడ్డి మాట్లాడుతూ రోటరీక్లబ్ తీసుకున్న ఎలాంటి నిర్ణయాలనైనా అమలు పరిచేందుకు కృషి చేస్తానన్నారు. రూ.40 లక్షలు తన సొంత నిధులతో స్వర్గధా మంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేవిధంగా చర్యలు చేపడతానన్నారు.

● **నూతన కమిటీ**

అధ్యక్షుడిగా ఏ.రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కేవీ.కృష్ణారెడ్డి, ఎస్.శివకుమార్, కార్యదర్శిగా జీ.రమేష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జీ.సురేష్ రెడ్డి, కోశాధికారిగా కే.హరిప్రసాద్‌రెడ్డి, కార్యనిర్వహకుడిగా ఎన్.ప్రతాప్‌రెడ్డి, తదితర సభ్యులను ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉలవపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉలవపాడు సమీపంలో రాజుపాలెం అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కొల్లూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన రావూరు కోటేశ్వరరావు నెల్లూరు వైపు వెళ్లే రోడ్డు మార్గంలో బైక్‌పై వెళుతూ రాజుపాలెం జంక్షన్ వద్ద రోడ్డు దాటే క్రమంలో అదే మార్గంలో వెళుతున్న మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలు కాగా, కోటేశ్వరరావు తలకు బలమైన గాయాలు తగలడంతో ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. మరో వ్యక్తిని ఉలవపాడు ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించారు. చికిత్స అనంతరం అతను అక్కడి నుంచి వెళ్లినట్లు తిలిసింది. అతని వివరాలు తెలియలేదు.

రెవెన్యూ క్రీడలు ప్రారంభం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ

కందుకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు డివిజన్ స్థాయిలో రెవెన్యూ సిబ్బందికి క్రీడా పోటీలను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో ఆదివారం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు కూడా అవకాశం లభిస్తుందని, తద్వారా విజేతలుగా నిలవాలని సూచించారు.

మన గ్రోమోర్ కేంద్రం ప్రారంభం

వలటివారిపాలెం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న పొట్టేళ్ల పెదఅంజయ్య కాంప్లెక్స్‌లో ఆదివారం మన గ్రోమోర్ కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా మేనేజర్ శంకరరెడ్డి మాట్లాడుతూ కోరమాండల్ కంపెనీ ద్వారా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, స్ప్రేయర్లు, పశువుల దాణా రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అలాగే వాహనాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా మార్కెటింగ్ మేనేజర్ గోపి, ఏరియా ఆడిటర్‌లు వసంత, ప్రసాద్, మేనేజర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఇంటూరి

కందుకూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు జూలై 2 నుంచి ఇంటింటి ప్రచారంపై చర్చించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం చంద్రబాబు నాయుడు ఆదివారం మంగళగిరిలో నిర్వహించిన సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌ను ప్రత్యేకంగా కలిసినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.

రోడ్డు పక్కన కార్మికుడి మృతి


రోడ్డు పక్కన మస్తాన్ మృతదేహం

నెల్లూరు(క్రైం), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సెంటర్‌లో కేఫ్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. అల్లూరు మసీదు వీధికి చెందిన పఠాన్ మస్తాన్(47) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఆయన పనుల నిమిత్తం నెల్లూరుకు వచ్చారు. స్టోన్‌హౌస్‌పేట సెంటర్‌లోని ఓ టీ దుకాణం వద్ద మస్తాన్ రోడ్డు పక్కన కుప్పకూలి పోయాడు. స్థానికులు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అనారోగ్యంతోనే మస్తాన్ మృతిచెందినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వంతెనపై ఇసుక తొలగింపు


వంతెనపై పేరుకుపోయిన ఇసుకను డోజర్‌తో తీయిస్తున్న ఎస్‌ఐ

సంగం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సంగం పాత ఆనకట్ట కనిగిరి ప్రధాన కాలువ వంతెన ముఖ ద్వారం వద్ద వంతెనపై వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఇసుకను ఎస్‌ఐ రాజేష్ ఆదివారం డోజర్‌తో తీయించారు. విరువూరు, సూరాయపాళెం నుంచి సంగం వైపు అధిక లోడుతో వచ్చే టిప్పర్ల నుంచి ఇసుక వంతెన ముఖద్వారం, వంతెనపై పడి పేరుకుపోయింది. దీంతో వంతెనపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండడంతో ఎస్‌ఐ రాజేష్ డోజర్‌తో ఇసుకను తొలగించారు. దీంతో స్థానికులు, ద్విచక్ర వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధ్యానంతో వ్యాధులు దూరం

ఆత్మకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు శరీరంలో నాడిశుద్ధి జరిగి రోగాలు దూరమవుతాయని సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ చంద్రా విజయమ్మ తెలిపారు. ఆదివారం పట్టణంలోని షిర్డీ సాయి పిరమిడ్ ధ్యానకేంద్రంలో మౌన ధ్యానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉప యుక్తమని తెలిపారు. ధ్యాన సాధకులు సజ్జన సాంగత్యంతో పాటు ఆత్మవిజ్ఞాన పుస్తకాలు చదవాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్లు, ధ్యానసాధకులు పాల్గొన్నారు.

విశ్వ కల్యాణం కోసం దానం చేస్తే సంపద వృద్ధి

వింజమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విశ్వ కల్యాణం కోసం దానం చేస్తే సంపద వృద్ధి చెందుతుందని గుంటూరు పిరమిడ్ మాస్టర్ బ్రద్రీ నారాయణ అన్నారు. స్థానిక వేద వ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం ద్వారా సాధించలేనిది ఏదీలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధ్యానులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి


కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

సీతారామపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వింజమూరులోని నేతాజీ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెగా జాబ్‌మేళాను మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమవారం ఉదయం 9గంటల నుంచి పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఆసక్తి కలిగిన యువకులు హెచ్‌టిటిపిఎస్:// ఎన్ఏఐపియు ఎన్హైఏఎం. ఏపి.జీఓవి.ఇన్/ యూజర్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ లింకులో నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫారం, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో జాబ్‌మేళాలో పాల్గొనాలన్నారు. ఈకార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, దేవర వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, తోట మనోజ్, వెంగళశెట్టి వెంకట్రావ్, తోట ఏడుకొండలు, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతం చేయండి

ఆత్మకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అలఘునాథస్వామి ఆలయ పునర్నిర్మాణం జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే మహా కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు రామయ్యస్వామి తెలిపారు. ఆత్మకూరులో మహిళా భక్తులతో కుంభాభిషేక మహోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా భక్తులు ప్రతిరోజూ విష్ణు సహస్ర నామ జపం, భజనలు చేయాలని కోరారు. అలఘునాథుని కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి, కెవి శేషరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, సోమవరపు యానాదిరెడ్డి, ఏపి వెంకటరెడ్డి, అచోలు నారసింహారెడ్డి, కేతా మస్తాన్‌రెడ్డి, రాపల్లి ప్రసాద్‌రెడ్డి, పురప్రముఖులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం : మాజీ ఎమ్మెల్యే మేకపాటి


రఫీని సన్మానిస్తున్న మేకపాటి, చెంచలబాబు

ఉదయగిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమేనని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయుడు షేక్ రఫీ ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం రఫీని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే స్థానిక బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ నాగయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, విశ్రాంత ఎంఈవోలు జీ.ఓబులరెడ్డి, అల్లాభక్షు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగార్పమ్మకు పూజలు


నాగవరపమ్మకు పూజలు చేస్తున్న అర్చకుడు

సంగం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మూల విరాట్‌కు అభిషేకాలు, పూలం గిసేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

●**ఉదయగిరి :** మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న నాగారప్పమ్మ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. చివరిరోజు మహిళా భక్తులు పొంగళ్ల సామగ్రితో బాణాసంచా పేలుళ్ల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులంతా సహపంక్తి భోజనాలు చేశారు.

వైభవంగా అంకాళమ్మ ఉత్సవాలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో ఉన్న అంకాళమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. నిలుపు ఘట్టపు కడవ మహోత్సవాలు దేవర ఇంటి నుంచి పసుపు, కుంకుమ, చీర, సారె కావిట్లు ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సింహ వాహనంపై గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు కాయా కర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరు కావడంతో ఆలయ అర్చకులు, నిర్వాహకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సన్మానించి అభినందనలు తెలిపారు.

ముగిసిన అచ్చమాంబ పేరంటాలు ఉత్సవాలు


అమ్మవారికి పొంగళ్లు వండుతున్న భక్తులు

మర్రిపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పొంగూరు మాలిచేలల్లో వెలసిన అచ్చమాంబ తల్లి పేరంటాలు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.